teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 275 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 12 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### పీజీ మెడికల్ సీట్ల స్థానికత కోటాపై కొనసాగుతున్న విచారణ



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటా చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పూర్తిస్థాయి విచారణకు అనుమతించింది. విచారణ సందర్భంగా పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటా చెల్లదంటూ ఇటీవల జస్టిస్ సుధాంశు దులియా

మిగతా 2 లో



# అవినీతి రాజకీయాలను ప్రజలే పాతరేయాలి!

## నేరస్తులుగా చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు

## చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం

**తక్షణం రాజకీయాలకు దూరంగా చేయాల్సిన అవసరం**

**తాజాగా తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు**

వివిధ కేసుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను తక్షణం రాజకీయాలకు దూరంగా చేయాల్సిన అవసరాన్ని తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రజాస్వామ్యవాదులను, లేదా భారత ప్రజలను హెచ్చరించింది. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు నేరస్తులు అయివుంటే ఆ చట్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవాలి. చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం చూస్తున్నాం. కోర్టు తీర్పులను కాలరాస్తున్న నేతలను చూస్తున్నాం. ఇలాంటి సమయంలో సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రజలకు కనువిప్పు కావాలి.



# రూ.200 నోట్లు బ్యాన్ చేస్తారని వస్తున్న వార్తలు ఫేక్

## సోషల్ మీడియాలో ప్రచారంపై స్పందించిన ఆర్బీఐ

200 నోట్లు బ్యాన్ అంటూ వస్తున్న వార్తలపై భారతీయ రిజర్వ్ బ్యాంకు కీలక ప్రకటన చేసింది. ఇటీవల మార్కెట్‌లో రూ.200. రూ.500 నకిలీ నోట్లు గణనీయంగా పెరిగాయని ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసులు కూడా కొన్ని చోట్ల దాడులు చేసి, దొంగ నోట్ల ముఠాలను అరెస్ట్ చేశారు. దీంతో ఈ నోట్లను బ్యాన్ చేయాలని ఆర్బీఐ నిర్ణయించిందని, త్వరలో బ్యాన్ దిశగా అడుగులు వేస్తోందని వార్తలు ఊపందుకున్నాయి.



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఈ వార్తలపై రిజర్వ్ బ్యాంక్ క్లారిటీ ఇచ్చింది. రూ.200 నోట్లు బ్యాన్ చేస్తారని వస్తున్న వార్తలను కొట్టిపారేసింది. రూ. 200 నోట్ల రద్దు లాంటి ఆలోచనలు, ప్రకటనలు ఏవి లేవని స్పష్టం చేసింది. నోట్ల బ్యాన్ లాంటి వార్తలు



# మావోయిస్టుల హింసాత్మక కార్యక్రమాలు 47శాతం తగ్గుముఖం

### కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడి

చత్తీస్ గఢ్ లో మావోయిస్టుల హింసాత్మక కార్యక్రమాలు 2010నాటితో పోలిస్తే 47శాతం తగ్గినట్లుగా కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడించారు. 2024లో మావోయిస్టుల గ్రూపుల హింసాకాండలో పౌరులు, భద్రతా సిబ్బంది మృతుల సంఖ్య కూడా 64 శాతం తగ్గినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): లోక్ సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బదులు ఇచ్చారు. 2024లో చత్తీస్ గఢ్ లో వామపక్ష తీవ్రవాదం కేసులు 267 నమోదు అయినట్లు తెలిపారు. 2010లో ఆ సంఖ్య 499గా ఉన్నట్లు వెల్లడించారు. పౌరులు, భద్రతా దళాల సంఖ్య 2010లో 343 ఉండగా, గత

మిగతా 2 లో

# ఫిబ్రవరి 11న "సీఎం రేవంత్ రెడ్డి" ప్రామిస్ డే

## ఆరు గ్యారంటీలు, హామీలు నిలబెట్టుకోవాలి

## ప్రభుత్వాన్ని కోరిన మాజీ మంత్రి హరీష్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఫిబ్రవరి 11న ప్రామిస్ డే సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలు ఈ ప్రామిస్ డే సందర్భంగా నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి హరీష్ రావు కోరారు. మంగళవారం నంగునూర్ మండలం కొనాయిపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో హరీష్ రావు పాల్గొని ప్రత్యేక

మిగతా 2 లో



# మహా శివరాత్రి నేపథ్యంలో శైవ క్షేత్రాల్లో ఏర్పాట్లు చేయాలి

**అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 11. (తీన్మార్ న్యూస్): మహా శివరాత్రి పండగ పర్వదినం నేపథ్యంలో అన్ని శైవ క్షేత్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2 లో

# చికెన్ ప్రియులకు, వ్యాపారులకు సర్కార్ హెచ్చరిక

### బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన






04

# మందు బాబులకు భారీ షాక్

అనూహ్యంగా బీర్ల ధరలను 15 శాతం పెంచుతూ నిర్ణయం




04

# మహిళల హామీలను అమలు చేయకపోతే పోరాటాలు చేస్తాం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# ఏడాది కోర్సుగా అందుబాటులోకి రానున్న బీఈడీ

ఎన్సీటీఈ మీటింగ్లో డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌కు ఆమోదం




04

# కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా వృక్షార్చన కార్యక్రమం

## ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని శ్రేణులకు పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఈనెల 17న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక పిలుపునిచ్చారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 'వృక్షార్చన' పేరుతో ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'హరితహారం' ద్వారా తెలంగాణ భూతల్లికి ఆకుపచ్చని

మిగతా 2 లో





# డిమాండ్ మేరకు విద్యుత్తు సరఫరాకు సిద్ధంగా ఉన్నాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మంగళవారం ఆయన సచివాలయంలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా

మిగతా 2 లో

# జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు విడుదల




.. వివరాలు 2లో

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందుబాటులో ఉంచాలి

**సరసమైన ధరకు ఇసుక సరఫరా చేయాలి**

**రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ లతో సీఎస్ వీసి ద్వారా ఆదేశాలు**



02

# రూ.200 నోట్లు బ్యాన్ చేస్తారని వస్తున్న వార్తలు ఫేక్

మొదటి పేజీ తరువాయి

నమ్మొద్దని సూచించింది. మార్కెట్లో నకిలీ నోట్లు పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నకిలీ నోట్లను గుర్తించేందుకు అందరూ అవగాహనతో ఉండాలని తెలిపింది. మీ దగ్గర ఉన్నది నకిలీ నోటు అని అనుమానం వస్తే వెంటనే ఆ నోటును ఈ విధంగా చెక్ చేసుకోవాలని కొన్ని గుర్తులను సూచించింది. రూ.200 నోటుకు ఎడమవైపు దేవనాగరి లిపిలో 200 అని రాసి ఉంటుందని, మధ్యలో మహాత్మా గాంధీ బొమ్మ ఉంటుందని తెలిపింది. అలాగే "%=దీ×%", "%దీష్ఠుతీఫ్%", "%×అఎఖు%" తో పాటు "200" అని సూక్ష్మ ఇక కుడివైపున అశోక స్థూపం గుర్తు ఉంటుందని, ముందుగా గ్రీన్ కలర్ లో ఉండి, నోటును అటు ఇటు తిప్పుతుంటే బ్లూ కలర్ లోకి మారుతూ ఉంటుందని వివరణ ఇచ్చింది. కాగా పెద్ద నోట్ల రద్దు తర్వాత కేంద్రం కొత్త నోట్లను మార్కెట్ లోకి తీసుకొచ్చింది. అనంతరం ఇటీవలే రూ.2000 నోట్లు బ్యాన్ చేసి, ప్రజల వద్ద ఉన్న నోట్లను తిరిగి తీసుకున్నది. ఇప్పటి వరకు దాదాపు 98 శాతం 2 వేల నోట్లు ఆర్బీఐ కి చేరాయి.

# మావోయిస్టుల హింసాత్మక కార్యక్రమాలు 47శాతం తగ్గుముఖం

మొదటి పేజీ తరువాయి

ఏడాది ఆ సంఖ్య 122కు తగ్గినట్లు తెలిపారు. గడిచిన అయిదేళ్లలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు 1925 కోట్ల నిధుల్లో 43 శాతాన్ని అందజేసినట్లు మంత్రి చెప్పారు. మరోవైపు కేంద్రం ప్రకటన నేపథ్యంలో చత్తీస్ గఢ్ లో మావోయిస్టులు ఏరివేత ఆపరేషన్లలో భాగంగా గత ఏడాది జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో 287మంది మావోయిస్టులు చనిపోగా ఈ ఏడాదిలో 40రోజుల్లోనే 81మంది మావోయిస్టులు మరణించడం గమనార్హం.

# చికెన్ ప్రియులకు, వ్యాపారులకు సర్కార్ హెచ్చరిక


తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): చికెన్ ప్రియులకు, కోళ్ల పెంపకందారులకు, చికెన్ వ్యాపారులకు తెలంగాణ ప్రభుత్వం షాకింగ్ వార్నింగ్ జారీ చేసింది. కోళ్లకు సోకుతున్న బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లోని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో భారీ సంఖ్యలో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా (హెచ్5ఎన్1 - బర్డ్ ఫ్లూ) వైరస్ కారణమని నిర్ధారించారు. ఈ వ్యాధి కోళ్లలో వేగంగా వ్యాపిస్తూ తెలంగాణకు కూడా విస్తరించనుందన్న సమాచారం నేపథ్యంలో కొన్ని రోజులు కోళ్ల పెంపకం మాంసం వినియోగం పట్ల జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకుని ముందస్తుగా జాగ్రత్తగా ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నట్లుగా తెలంగాణ పశుసంవర్ధక, మత్స్యశాఖ విభాగం తెలిపింది. కోళ్లు, ఇతర జంతువులలో సంభవించే అనుమానస్పద, వైరస్ మరణాల వివరాల పట్ల కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. కోళ్ల పెంపకందారులు, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై బర్డ్ ఫ్లూ వ్యాప్తి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొంది. జిల్లాలోని కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోతే వెంటనే సంబంధిత వెటర్నీ దవాఖానలో సమాచారం ఇవ్వాలని యాజమానులకు సూచించారు. ఇప్పటికే బర్డ్ ఫ్లూ వ్యాధిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల ఫారాల యాజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వెటర్నీ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సహకరించాలని, ప్రతి సమాచారం అందించాలని కోళ్ల ఫారాల యాజమానులకు కలెక్టర్లు సూచించారు. మరోవైపు బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి కోళ్లు, గుడ్లు, పౌల్ట్రీ ఫీడ్ (కోళ్ల దానా) దిగుమతులను పశుసంవర్ధక శాఖ నిషేధించినట్లు తెలుస్తోంది. అవి ఇతర రాష్ట్రాల నుంచి రావడం ద్వారా వైరస్ వ్యాపించే అవకాశం ఉంటుందని ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అయితే బర్డ్ ఫ్లూ వైరస్ అధిక ఉష్ణోగ్రతలో బతకలేదని కోడి మాసం, గుడ్లను బాగా ఉడకబెట్టి తింటే ఎలాంటి ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అధికారులు మాత్రం బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

# కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా వృక్షార్చన కార్యక్రమం

మొదటి పేజీ తరువాయి

చీర చుట్టిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవటమే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టినరోజు కానుక అని అన్నారు. వృక్షార్చన కార్యక్రమాన్ని నడిపించేందుకు బాధ్యతలు తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ జె సంతోష్ కుమార్ ను కేటీఆర్ అభినందించారు. రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేస్తున్న ఈ వృక్షార్చనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హరితసేనలోని సభ్యులందరూ మొక్కలు నాటి అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ హరిత తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా చంద్రునికో నూలు పోగులాగా వృక్షార్చన తాను కార్యక్రమాన్ని తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ ఆఫీస్ సెక్రటరీ, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, బీగాల గణేష్, శంకర్ నాయక్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ సమక్షంలో విడుదల చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అందుబాటులో ఉంచాలి



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి మంగళవారం మధ్యాహ్నం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ కలెక్టర్లతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తగిన ఇసుక అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే వినియోగదారులకు సరసమైన ధరకు ఇసుక సరఫరా చేయాలని దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లకు సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు ఇచ్చారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డులు నిత్యం తనిఖీ చేయాలని వెంటనే ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలని ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి తెలిపారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తున్న క్రమంలో సీఎస్ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం సరసమైన ధరలకు సిమెంట్, ఐరన్ తో పాటు ఎంతో ముఖ్యమైన ఇసుక ను కూడా అందించనున్నట్లు తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రోజు సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వాటిని మొత్తం మూడు జాబితాలు గా విభజించారు. ఇందులో ఎల్-1, ఎల్-2, ఎల్-3గా అప్లికేషన్లను విభజించారు. ఇందులో మొదటగా ఎల్-1 కేటగిరిలో సొంత స్థలం ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో సొంత స్థలంలో గుడిసె, పూరిపాక, మట్టి మిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని చేర్చారు.

# అవినీతి రాజకీయాలను ప్రజలే పాతరేయాలి!



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): అవినీతి, క్రిమినల్ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలంతా చైతన్యం కావాలి. మాకొద్దీ దగుల్బాజీ రాజకీయమని నినదించాల్సి ఉంది. మరో అన్నా హజారే లాగా ఉద్యమించాల్సి ఉంది. ప్రజలు తమ దేశం కోసం లేదా అవినీతి లేని రాజకీయం కోసం కొంత సమయం వెచ్చించాల్సి ఉంది. చిన్న లంచం తీసుకుంటేనే అరెస్ట్ చేసి బొక్కలో వేస్తున్న మనం..ఇప్పుడు క్రిమినల్ కేసులు, డబ్బులు స్వాహా చేసిన వారిని, ప్రజాధనం లూటీ చేసిన వారిని రాజకీయాల్లో కొనసాగించడం అవసరమా అన్నది చర్చించాలి. ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై సుప్రీం కోర్టులో సోమవారం విచారణ జరిగింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్విని ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42 మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవన్నారు. నిజానికి చట్టాలు చేసే పార్లమెంట్, అసెంబ్లీలో క్రిమనల్స్ లేదా కేసులు ఉన్నవారు మంచి చట్టాలు చేస్తారని అనుకోవడానికి లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఐదేళ్లు సిఎంగా పాలన చేశారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేశారు. తొమ్మిదిన్నరేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ అనేక ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయనే అన్నాహజారే జనలోక్‌పాల్ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు. కానీ కోర్టు కేసుల్లో ఉన్న నేతలు మళ్లీ మళ్లీ ఎన్నికవుతూ...ఈ సదాశయాన్ని తుగంలో తొక్కారు. తమ విలాసాలకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. అందుకు కేజ్రీవాల్ నివాసం, విశాఖలో జగన్ కట్టించిన విలాసవంతమైన భవనాలే నిదర్శనం. ప్రజలు తిండికి, గుడ్డకు కష్టపడుతుంటే ..ప్రజాధనంతో జల్సాలు చేసే నేతలు దేశానికి అవసరమా అన్నది ప్రజలే ఆలోచించాలి. ఇకపోతే కేసులు ఎదుర్కొంటున్న నిందితులు ఏళ్లుగా విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం జాప్యానికి మరో కారణమని నివేదికలో పొందుపరిచారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరేందుకే అనర్హులని, అలాంటిది ప్రజా ప్రతినిధులుగా ఎలా అర్హులవుతారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది.ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని కూడా సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని ర ష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. నిజానికి సుప్రీం వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఆనాడు అన్నాహజారే వెలిబుచ్చారు. రాజకీయ అవినీతిని తరిమేందుకు ప్రత్యేక కోర్టులు లేదా జనలోక్÷-పాల్ రావాలని డిమాండ్ చేశారు. నేను అవినీతికి వ్యతిరేకమని అంటున్న మోడీ కూడా దీనిగురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకపోతే రాజకీయ నేతలు తెలివిలో ఆరితేరారు. లాలూప్రసాద్పై కేసు రాగానే ఆయన భార్యను రంగంలోకి దింపారు. తరవాత కుమారుడు రంగంలోకి దిగాడు. శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తున్నారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్టంగా ఉండరాదు. అలా ఉంటే తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. అందుకే రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం వ్యక్తం చేసింది. 42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటని తెలిపింది. శిక్షపడ్డ ప్రజాప్రతినిధులపై కేవలంఆరేళ్ల పాటే అనర్హత వేటు వేసి వదిలేస్తే ఎలా అని కూడా సంశయించింది. వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలని వ్యాఖ్యానించింది. దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా అని కూడా ప్రశ్నించింది. సుప్రీం అభిప్రాయం ప్రకారం నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడం అవసరం. అప్పుడే మన ప్రజాస్వామ్యంలో కళంకితును దూరం చేయగలం. ఈ విషయంలో మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన నేపథ్యంలో వారి అభిప్రాయం ఎలా ఉన్నా ప్రజలు ముఖ్యంగా ఓటేస్తున్న ఓటర్లు చర్చించాలి. క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని నెత్తికి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందా అన్నది విచారణ చేయాలి. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశంగానే చూడాలి. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాల్సిందే. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే సుప్రీం అభిప్రాయానికి అనుగుణంగా ఓటర్లు స్పందించాలి. జనం స్పందించాలి. నేరమయ రాజకీయాలకు పాతరేయాలి. ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరినా అల ఆజరుగుందని అనుకోవడానికి లేదు. వారు సానుకూలంగా స్పందిస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. అదేదో ప్రజలే చేయాలి. నేరమయ రాజకీయ నేతలను దూరంగా పెట్టే చైతన్యంతో సాగాలి.

# ఫిబ్రవరి 11న "సీఎం రేవంత్ రెడ్డి" ప్రామిస్ డే

మొదటి పేజీ తరువాయి



పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొనాయిపల్లి వేంకటేశ్వర స్వామి కేసీఆర్‌కు ఇష్టమైన దేవుడు ఆయన ఏ శుభకార్యం తలపెట్టినా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో కేసీఆర్ యాదాద్రితో సహా ఎన్నో దేవాలయాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. రేవంత్ సర్కార్ 15 నెలల్లో దేవాలయాలకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఒక్క ఆలయాన్ని అభివృద్ధి చేయలేదని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల పట్ల చిన్నచూపు చూస్తున్నదని దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పాడని అన్నారు. 2024 ఆగష్టు 15 లోపు రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు వేసి ఇంతవరకు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఏ అంశంలో చూసినా మాట ఇచ్చుడు మాట తప్పుడు సీఎం రేవంత్‌కు అలవాటని ఎద్దేవా చేశారు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా ఇప్పటిదాక పడలేదని కేసీఆర్ తెచ్చిన అనేక పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు పెట్టిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నైజం ప్రజలకు అర్థమైందని అందుకే మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను దారుణంగా ఓడించారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాకే ఎన్నికలకు వెళ్లాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు విడుదల




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసింది. టాపర్స్ జాబితాలో తెలంగాణ విద్యార్థి బనిబ్రత మాజీ నిలవడం విశేషం. దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులకు 100 పర్సంటైల్ వచ్చినట్లు ఎన్టీఏ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గుత్తికొండ సాయి మనోజ్ఞ కూడా టాపర్స్ జాబితాలో నిలిచింది. టాప్ 14 జాబితాలో గుత్తికొండ సాయి మనోజ్ఞ తప్ప మిగిలిన టాపర్స్ అంతా అబ్బాయిలే కావడం గమనార్హం. ఎస్టీ కేటగిరీలో రాజస్థాన్‌కు చెందిన పార్థ్ సెహ్రా, పీడబ్ల్యూబీడీ కేటగిరీలో ఛత్తీస్ ఘర్‌కు చెందిన హర్షల్ గుప్తా జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌లో టాపర్స్‌గా నిలిచారు. జనవరి 22 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్ పరీక్షలు జరిగాయి. దేశవ్యాప్తంగా 12.58 లక్షల మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్ష రాశారు. ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్ష జరగనుంది. పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డారనే కారణంగా 39 మంది విద్యార్థుల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించలేదు. ఓబీసీ ఎన్సీఎల్ కేటగిరీలో ఢిల్లీకి చెందిన దక్ష్, ఎస్సీ కేటగిరీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయాస్ లోహియా 14 మంది టాపర్స్ జాబితాలో నిలిచారు.

**జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాల్లో సత్తా చాటిన టాపర్స్ జాబితా:**

- బనిబ్రత మజి-తెలంగాణ
- గుత్తికొండ సాయి మనోజ్ఞ-ఆంధ్రప్రదేశ్
- కుషగ్ర గుప్త-కర్ణాటక
- ఆయుష్ సింఘాల్-రాజస్థాన్
- హర్ష్ ఝా-ఢిల్లీ
- దక్ష్-ఢిల్లీ
- శ్రేయాస్ లోహియా-ఉత్తర్ ప్రదేశ్
- సాక్షం జిందాల్-రాజస్థాన్
- సౌరవ్-ఉత్తర్ ప్రదేశ్
- రైత్ గుప్తా-రాజస్థాన్
- విషద్ జైన్-మహారాష్ట్ర
- అర్నవ్ సింగ్-రాజస్థాన్
- శివెన్ వికాస్ తోష్నివాల్-గుజరాత్
- ఎస్ఎం ప్రకాష్ బెహెరా-రాజస్థాన్

# హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి



నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రస్తావించింది. త్రిసభ్య ధర్మాసనం తీర్పును దృష్టిలో ఉంచుకుని తమ పిటిషన్ ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని కోరింది. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తిని విన్న కోర్టు విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటే ముందు తాము విచారణ చేపడతామని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది.

# డిమాండ్ మేరకు విద్యుత్తు సరఫరాకు సిద్ధంగా ఉన్నాం

మొదటి పేజీ తరువాయి



ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది. అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనేది సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అన్నారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాలి అన్నారు. విద్యుత్ శాఖలో లైన్మెన్ మొదలు విద్యుత్ శాఖ మంత్రి వరకు ఒక కుటుంబంలో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారికి ఫోన్ చేయాలని వారు స్పందించని పక్షంలో ఆపై అధికారికి అలా నాకు కూడా ఫోన్ చేయవచ్చని సిబ్బందికి డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. మీకు క్షేత్రస్థాయిలో కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం, ఏదైనా అడగవచ్చని అధికారులకు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కోరిన అన్ని అనుమతులు ఇచ్చాం, మార్చి మొదటి తేదీ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా సబ్ స్టేషన్ లపై పెరుగుతున్న లోడ్ భారం వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. బాగా పని చేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు సైతం ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మొన్నటి భారీ వరదల సమయంలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అటువంటివారిని గుర్తించాలని డిప్యూటీ సీఎం అన్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం కోరారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి ఈ రంగంలో ప్రపంచంలో వస్తున్న మార్పులపై సిబ్బందికి అవగాహన అవసరమని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు.


# మహా శివరాత్రి నేపథ్యంలో శైవ క్షేత్రాల్లో ఏర్పాట్లు చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఫిబ్రవరి 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు మహా శివరాత్రి పర్వదినం జరగనున్న నేపథ్యంలో సచివాలయంలో ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, కీసర రామలింగేశ్వర స్వామి, ఏడుపాయల వన దుర్గ భవానీ అమ్మవారు, రామప్ప, మేళ్ళచెరువు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం, చాయా సోమేశ్వర ఆలయం పానగళ్ళు, సోమేశ్వర దేవస్థానం పాలకుర్తి, వెయ్యి స్థంభాల గుడి, మెట్టుగుట్ట దేవాలయం, కాశిబుగ్గ ఆలయం, భద్రకాళి, తదితర దేవస్థానాల్లో అవసరమైన ఏర్పాట్లపై మంత్రి సురేఖ అధికారులను సేకరించారు. గతేడాది శివరాత్రి ఉత్సవాల నిర్వహణా అనుభవాల ఆధారంగా ఈ సంవత్సరం భక్తులకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం రుద్రాభిషేకం, సామూహిక బిల్వార్చన, రుద్ర హెూమం, ప్రవచనాలతో పాటు క్యూలైన్ మేనేజ్‌మెంట్, తాగునీరు వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విద్యుత్ వసతి, వాహనాల పార్కింగ్, ఆరుబయట ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులు మంత్రికి సమగ్రంగా వివరాలు తెలిపారు. మంత్రి కూడా కొన్ని ప్రత్యేక సూచనలు అందజేశారు. ఎండా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపావసం ఉండే భక్తులకు పండ్లు, అల్పాహారం ఉచితంగా పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి ఆలయం దగ్గర ఎంట్రీ పాయింటులు, ఎగ్జిట్ పాయింటులను పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ దేవాలయాల దగ్గర ఎక్కడా లిక్కర్ అమ్మకాలు చేయరాదని ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి, లిక్కర్ దొడ్డి దారిని అమ్మినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా దేవాలయాలున్న పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో స్థానిక, ఆంగ్ల భాషల్లో సూచీ బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భద్రత కోసం సీసీ కెమోరాల ఏర్పాటు, పారిశుధ్య చర్యలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే చోట అంబులెన్స్ లు కూడా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అన్ని దేవాలయాలను సమన్వయం చేసేందుకు హైదరాబాద్ ఎండోమెంట్ కమిషనరేట్ ఆఫీసులో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి నదీ, ఇతర నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి వంటి కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన కసరత్తు చేయాలని కోరారు. ఆగమ శాస్త్రాల ప్రకారం ఈ కసరత్తు చేయాలని చెప్పారు. మహా శివరాత్రి నిర్వహణకు ఖర్చుకు వెనకాడ కూడదని, ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో అన్ని దేవాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిపేందుకు జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులతో సమన్వయం అవసరమని మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

### ప్రభుత్వ కళాశాలలో చేరండి



ఆత్మకూర్ ఫిబ్రవరి 11 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి అంజయ్య ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం భాగ్య వర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు అమరచింత మండలం ఈర్లదిన్నె మస్తీపురం గ్రామంలో ని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరితే మీకు ఉజ్వల భవిష్యత్తును కల్పిస్తామంటూ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. కళాశాలలో ఎంపీసీ బైపిసి,హెచ్ఈసి, సిఈసి, కోర్సులు వంటి తెలుగు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నామని, ప్రైవేట్ కళాశాల దీటుగా ప్రభుత్వ కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపక బృందం ద్వారా విద్యాబోధన అందిస్తున్నామని ప్రతి ఒక్కరు ప్రైవేట్ కళాశాలలో చేరి తల్లిదండ్రులకు ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని బంగారు భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పెన్నును పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ఏ కురుమూర్తి ఆరు బుచ్చయ్య మరియు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో రానున్న జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, అసిస్టెంట్, అధికారులకు, ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు, ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఎన్నికల విధి నిర్వహణలో ఎన్నికల సంఘం సూచనలు, ఆదేశాల మేరకు పక్కాగా నిబంధనలు అమలు చేస్తూ పనిచేయాలని, సంబంధిత సిబ్బందికి సూచించారు. జిల్లాలో (18) జడ్పిటిసి స్థానాలకు (18) రిటర్నింగ్ అధికారులు, (193) ఎంపీటీసీ స్థానాలకు (63) మంది రిటర్నింగ్ అధికారులు, (63) మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బందికి మాస్టర్స్ ట్రైనర్స్ రామయ్య, ప్రవీణ్ లతో ఉదయం, సాయంత్రం సెషన్స్ నిర్వహించడం జరిగిందని ఎలాంటి సందేహాలు ఉన్న నేరుగా గాని ఫోన్ లో గాని క్లారిఫికేషన్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన విధులను నిర్వహించాలని, ప్రతి దానికి సమాధానం ఎన్నికల సంఘం జారీ చేసిన ఆర్వో బుక్ లో ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు (లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కే.వీరబ్రహ్మచారి, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, అన్ని విభాగాల జిల్లా అధికారులు రిటర్నింగ్ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతుల భూములను పరిశీలించిన కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వ్యవసాయ భూములను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం నేషనల్ హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. మొగుళ్ళపల్లి మండలం ఇస్సీపేట, రంగాపురం గ్రామాలలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే లో భూములు కోల్పుతున్న రైతులతో ముఖానికి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగ్ పూర్ నుండి విజయవాడ వరకు నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే భూపాలపల్లి జిల్లాలో టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా వెళ్తున్న క్రమంలో భూ సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మొగుళ్ళపల్లి మండలంలోని ఇస్సీ పేట, రంగాపూర్, మేదర మెట్ల, మొగుళ్ళపల్లి గ్రామాలలో సుమారు 8.78 కిలో మీటర్ల మేర నేషనల్ హైవే వెళ్తున్న క్రమంలో రైతులనుండి భూసేకరణ చేపట్టామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు పరిహారం అందిస్తామన్నారు. రంగాపూర్ గ్రామ శివారులో 20 ఎకరాల విస్తీర్ణంలో రెస్ట్ పాయింట్ (పార్కింగ్ ఏరియా)ఏర్పాటు చేస్తున్నారని నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి దానిని ప్రభుత్వ భూమి ఉన్న చోటకు మార్చాలని రైతులు కోరగా నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి మార్చుటకు ప్రయత్నిస్తానని కలెక్టరు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లా కలెక్టర్ తమ వ్యవసాయ భూములను సందర్శించినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పి.డి దుర్గా ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఏ.డీ సునీల్, ఆర్డీఓ రవి,తహసీల్దార్ సునీత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపిటిసి, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

### రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): త్వరలో జరగబోయే ఎంపిటిసి, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 87- ఎంపిటిసి, 10- జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఎంపిటిసి, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ఎంపిటిసి, జెడ్పీటీసీ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసుకుని, నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎంపిడిఓ లు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.



## మొగుళ్ళపల్లిలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మొగుళ్ళపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల హాజరు నమోదు పట్టిక, ల్యాబ్, ఫార్మాసి, వార్డులను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సేవలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. అత్యవసర సమయాలలో ఉపయోగించే అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సేవలుకు ఎలాంటి ఇబ్బంది రావొద్దని తెలిపారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ వంటగది, డైనింగ్ హాల్, విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్నం భోజనంను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజు భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత డైట్ మెనూ కచ్చితంగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రోజు భోజనాన్ని ప్రత్యేక అధికారి, వార్డెన్ తనిఖీ చేయాలని ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, మాంసం అందించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, తహసీల్ధార్ సునీత, ప్రత్యేక అధికారి శారద, ఏటీపీ లు ప్రభాకర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సమాఖ్య సభ్యులచే వెదురు సాగు

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): మన రాష్ట్రంలోని 5 జిల్లాలలో ( భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, అదిలాబాద్ మరియు ఆసిఫాబాద్ ) జిల్లాకు వెయ్యి మంది చొప్పున 5000 మంది మహిళా సమాఖ్య సభ్యులచే వెదురు సాగు ప్రయోగాత్మకంగా చేపట్టుటకు గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్ణయించడం జరిగిందని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో రెండవ రోజు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వెదురు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని చండ్రుగొండ, ములకలపల్లి మరియు గుండాల మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద తీసుకోవడం జరిగిందని ఈ మండలాల్లోని 1000 మంది మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి వారికి వెదురు సాగు పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వీరికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు సరఫరా మరియు నిర్వహణ కొరకు నిధులు సమకూర్చడం జరుగుతుంది ఆమె తెలిపారు.

వెదురు మొక్కలు నాటిన తర్వాత నాలుగు సంవత్సరాలకు దిగుబడి ప్రారంభమవుతుందని, అప్పటి నుండి 80 సంవత్సరముల వరకు ప్రతి సంవత్సరం వెదురు దిగుబడి అమ్మడం ద్వారా రైతు ఆదాయం గడించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి సర్టిఫికెట్ మరియు మార్కెటింగ్ కు సంబంధించి సెర్ప్ మరియు ఇండస్ట్రీ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఆర్ డి ఓ నీలేష్, మూడు మండలాల డీపీఎంలు, ఏ పీ ఎం లు, సీసీలు, ఏపీవోలు, ఎఫ్ పి ఓ లు, బి ఓ డి లు, ఉద్యానవన శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ అధికారులు రమ్య, శ్రీకాంత్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్ట్ ఏర్పాటు భూ సేకరణకై రైతులతో కలెక్టర్ చర్చ



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆర్ అండ్ బి ఇరిగేషన్ రెవెన్యూ శాఖల అధికారులతో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు భూ సేకరణకై గుంటూరు పల్లి, బొల్లికుంట గ్రామాలకు చెందిన రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ కి ఎయిర్ పోర్ట్ రావడం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నగరాల్లో వరంగల్ కూడా ఒక స్థానం కలిగి ఉంటుందని, ఇందుకు ప్రతి ఒక్క రైతు సహకరించాలి అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎయిర్ పోర్ట్ సర్వే కు సంబంధించిన భూములకు హద్దులు నిర్ణయించుటకు రైతులు సహకరించాలన్నారు. అలాగే రైతులు కోరిన విధంగా రోడ్డు కనెక్టివిటీ కి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఖిలా వరంగల్ తహసిల్దార్ నాగేశ్వర్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ విధుల పట్ల అవగాహన ఉండాలి

### అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న జరుగనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళిని అనుసరించి, జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు మొత్తం 74 మందికి ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మొదటి విడత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోలు, ఏపీవోలను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నెల 27న ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువు లోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నంబర్లు అందించి వారితో ఓటింగ్ జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీవోలు తమ పర్యవేక్షణలోనే ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వర చారి, ఎన్నికల సూపరిండెంట్ ధారా ప్రసాద్,డి ఎల్ ఎం టి పూసపాటి సాయి కృష్ణ, కిరణ్ కుమార్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై ఆసక్తి కలుగుతుంది

**విద్యపై ఇష్టత పెంచుకోవాలి**

**ఉత్తమ ఫలితాల సాధన కోసం నిరంతరం తపించాలి**

**విద్యలో పోటీతత్వం అవసరం**

**క్రమశిక్షణ, పట్టుదల విజయసోపానాలుగా నిలుస్తాయి**



జనగామ జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): జనగామ జిల్లాలో విద్యలో ఉత్తమ స్థాయి ఫలితాలు సాధించేందుకు జిల్లా యంత్రాంగం వేస్తున్న అడుగులు ఫలితాలను ఇస్తున్నాయి. దాతల సహకారం లభించడం, విద్యాశాఖ అధికారులు అంకిత భావంతో పనిచేయడం విద్యార్థులు పాఠశాలకు 100 శాతం హాజరు అవుతు వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మంగళవారం నర్మెట్ట మండల కేంద్రంలో ఎస్.ఎస్.సి. విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్య శాఖ వివిధ సబ్జెక్టు నిపుణులైన ఉపాధ్యాయులు పాల్గొనగా ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 7 సబ్జెక్టు లపై విద్యార్థులలో నెలకొన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు రాష్ట్ర స్థాయి నుండి ఆయా సబ్జెక్టు లలో నిష్ణాతులైన శిక్షకులను ఈ ప్రేరణ కార్యక్రమానికి రప్పించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు మార్గనిర్దేశనం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ పాల్గొని తన ప్రసంగం తో విద్యార్థులను ఉత్తేజ భరితులను చేశారు. మానసిక ధైర్యాన్ని ఇచ్చారు. వారిలో నెలకొన్న అపోహలు తొలగిస్తూ ఆత్మస్థైర్యం పెంపొందించారు. విద్యపై ఇష్టత పెంచుకోవాలని అత్యుత్తమ మార్కులను సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని ఏమాత్రం వృధా చేయరాదన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక తో విద్య నభ్యసించాలన్నారు. ప్రధానంగా 5 అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

సమయానికి భోజనం చేయాలని, ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై ఆసక్తి కలుగుతుందన్నారు. తమపిల్లల భవిష్యత్ ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. విద్యార్థుల మధ్య ఈ ఒరియంటేషన్ కార్యక్రమాలు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. విద్యలో చర్చ ద్వారా విజ్ఞానం బలీయంగా నాటుకుంటుందని చెప్పారు. అనంతరం దాతలు సమకూర్చిన పరీక్ష ప్యాడ్, స్కేల్, కంపాక్స్, పెన్ తదితర పరీక్ష సామగ్రి తో కూడిన కిట్ ను విద్యార్థులకు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.ఓ.శ్రీనివాస్, ఎం.ఈ.ఓ. మదుపల్లి ఐలయ్య, ప్రధానోపాధ్యాయులు వేణు,గోపాల్ రెడ్డి, కమల, తహసీల్దార్ ఆంజనేయ చారి, సబ్జెక్టు నిపుణులు, రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నందు సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెఫర్ ఇంటర్ నెట్ డే అనేది ఆన్ లైన్ భద్రత, డిజిటల్ సంరక్షణ ప్రాధాన్యతను ప్రజలకి అవగాహన కల్పించటానికి చేపడుతున్న కార్యక్రమం అని అన్నారు.ఆధార్, పాన్ లేదా బ్యాంక్ వివరాలకు సంబందించిన ఓ టి పి ని ఎవరైనా ఫోన్ లో అడిగితె చెప్పవద్దని, డబ్బులు చెల్లించేటప్పుడు క్యూ ఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి చెల్లించాలని, ఆన్ లైన్ లో ఎవరికి వ్యక్తగత సమాచారం పంచుకోరాదని, తెలియని వారు ఏమైనా ఆన్ లైన్ లింక్ లు పంపితే వాటిని వెంటనే తొలగించాలని,ఆన్ లైన్ లో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ ఆదాయం వస్తదనే అఫర్లను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. సైబర్ నేరాల వళ్ళ ఎవరికైనా సమస్య ఏర్పడితే వెంటనే టోల్ ఫ్రి నెంబర్ 1930 కి కాల్ చేసి పిర్యాదు చేయాలని తదుపరి అధికారులు సమస్యని పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు.సైబర్ హైజీన్ అనేది వ్యక్తులు తమ ఫోన్, కంప్యూటర్ తదితర పరికరాలలో వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకింగ్, మాల్వేర్ వంటి వాటి నుండి సంరక్షించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరిండెంట్లు శ్రీనివాస రాజు , పద్మారావు, యల్ డి యం బాపూజీ, ఈ డి యం గఫార్,ఎన్ఐసి సిబ్బంది అర్షద్, లావణ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా ఉపయోగించుకోవడం ద్వారా సైబర్ ప్రమాదాలను తగ్గించవచ్చు



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా, మరియు భద్రంగా ఉపయోగించుకోవడం ద్వారా సైబర్ ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని జిల్లా సమాచార అధికారి (డి.ఐ.ఓ) సు-ధీర్, జిల్లా రెవెన్యూ అధికారి గణేష్‌లు పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (ఐడిఓసి) వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్.ఐ.సి) వారి ఆధ్వర్యంలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం (సేఫర్ ఇంటర్‌నెట్ డే) సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బందికి సురక్షితమైన ఇంటర్‌నెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలకు సంబంధించిన ఇంటర్‌నెట్ సేవలపై సందేహములను నివృత్తి చేశారు. సైబర్ భద్రత పై అవగాహన, బలమైన పాస్‌వర్డ్ వినియోగం, ద్విపాత్రిక ధృవీకరణ (2ఎఫ్.ఏ) సురక్షిత వెబ్ బ్రౌజింగ్, మరియు సైబర్ నేరాల నివేదిక విధానాల గురించి, ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఉపయోగించుకునే మార్గాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం నివారణ, వ్యక్తిగత డేటా రక్షణ, సమాజంలో సైబర్ మోసాలు, హ్యాకింగ్, ఫిషింగ్, తదితర అంశాలపై (డి.ఐ.ఓ) సుధీర్ వివరించారు. అదేవిధంగా మాల్వేర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల్లో సురక్షిత డిజిటల్ ప్రవర్తన అలవర్చుకోవడం అత్యవసరమని నిపుణులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి గౌరీశంకర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అనంత రామకృష్ణ, ఈడిస్ట్రిక్ -జిల్లా మేనేజర్ (ఈడిఎమ్) శ్రీదర్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో ఆపదమిత్ర వాలంటీర్లు ఉత్తమ సేవలను అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి**





హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆపదమిత్ర వాలంటీర్లు అత్యుత్తమ సేవలను అందించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ లోనే శిక్షణ కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వాలంటీర్లకు 12 రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఆపదమిత్ర వాలంటీర్లు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఇతర శాఖల సమన్వయంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాల నుండి కాపాడటంలో ఆపద మిత్ర వాలంటీర్లు సేవలందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా ఆపదలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించవచ్చునే మెలకువలను ఆపదమిత్ర వాలంటీర్లు శిక్షణలో తెలుసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా ఫైర్ అధికారి కొండం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మేము చెప్పే మెళుకువలు నేర్చుకొని ఆపద కాల సమయంలో వారిని రక్షించు కోవడానికి మరియు పక్కవారిని కూడా రక్షించుకోవడానికి, పనికి వస్తాయని అంతేకాకుండా సమాజ సేవ చేసిన వారమవుతావని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఫైర్ అధికారి కె వెంకట సతీష్ కుమార్, హాసన్పర్తి తహసిల్దార్ ప్రసాద్, సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మందు బాబులకు భారీ షాక్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): వేసవి వేళ తెలంగాణలో మందు బాబులకు భారీ షాక్ తగిలిన విషయం తెలిసిందే. ప్రభుత్వం అనూహ్యంగా బీర్ల ధరలను 15 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు పెంచిన ధరలు మంగళవారం నుంచే అమల్లో ఉంటాయని పేర్కొనడంతో మద్యం ప్రియులంతా ఒక్కసారిగా షాక్ గురయ్యారు. బీర్ల ధరల పెంపుతో ప్రభుత్వానికి రూ.700 కోట్లకు పైగా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ధరల వివరాలు:

లైట్ బీరు రూ.150 ఉండగా రూ.172.5కి పెంపు

కేఎఫ్ ప్రీమియం రూ.160 నుంచి రూ.184కి పెంపు

బడ్వైజర్ లైట్ రూ.210 నుంచి రూ.241.5 కి పెంపు

కేఎఫ్ అల్ట్రా మ్యాక్స్ రూ.220 నుంచి రూ.253కి పెంపు

బడ్వైజర్ మ్యాగ్నం రూ.220 నుంచి రూ.253కి పెంపు

టూబర్గ్ స్ట్రాంగ్ రూ.240 నుంచి రూ.276కి పెంపు


మరోవైపు ప్రభుత్వం ధరలు పెంచడంపై మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీర్ల కంపెనీల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గొద్దని మండిపడుతున్నారు. ప్రతీ సారి సరిగ్గా ఎండకాలం రాగానే ధరలు పెంచడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళల హామీలను అమలు చేయకపోతే పోరాటాలు చేస్తాం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మంగళవారం నాడు తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీల పై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయ మాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్ రెడ్డి మోసం చేశారని విరుచుకుపడ్డారు. ప్రతి మహిళకు నెలకు 2500 చొప్పున డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గెలిచినా కూడా అమలు చేయకపోవడం దారుణం. 14 నెలల డబ్బు రూ. 34,000 కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బాకీ పడింది. మహిళా దినోత్సవం లోపు ఈ హామీని నెరవేర్చాలి" అని డిమాండ్ చేశారు.

# ఏడాది కోర్సుగా అందుబాటులోకి రానున్న బీఈడీ

**ఎన్సీటీఈ మీటింగ్లో డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ కు ఆమోదం**




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్): ఇప్పటివరకు బీఈడీ కోర్సు రెండేళు ఉండేదన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ త్వరలో ఒకే ఏడాది కోర్సు అందుబాటులోకి రానుంది. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ అమలు చేయనుంది. ఇటీవల ఎన్సీటీఈకి సంబంధించి జరిగిన మీటింగ్లో డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ -2025 ను అధికారులు ఆమోదించారు. త్వరలోనే దీనిపై ప్రజల నుంచి ఫీడ్బ్యాక్ కూడా తీసుకోనున్నారు. ఇదిలాఉండగా బీఈడీ, ఎమ్ఈడీ కోర్సులు దశాబ్దాలుగా ఒక ఏడాది కోర్సు మాత్రమే ఉండేది. కానీ 2014లో ఎన్సీఈటీ దీన్ని రెండేళ్లకు పొడిగించింది. 10 ఏళ్ల తర్వాతా మళ్లీ ఇప్పుడు పాత విధానానికే శ్రీకారం చుట్టనుంది. అయితే ఇక్కడ తాజగా సవరించిన బీఈడీ, ఎమ్ఈడీకి సంబంధించి రెండేళ్ల కోర్సును పూర్తిగా రద్దు చేసినట్లు కాదు. ఎమ్ఈడీ ఒక ఏడాది కోర్సు ఫుల్ టైమ్ ఉంటుందని రెండేళ్ల కోర్సు టీచర్లు, అలాగే ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్లకు ఉంటుందని ఎన్సీటీఈ ఛైర్మన్ పంకజ్ అరోరా తెలిపారు. డ్రాఫ్ట్ రెగ్యులషన్స్ ప్రకారం ఒక ఏడాది బీఈడీ కోర్సు చేసేందుకు కేవలం నాలుగేళ్ల డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వాళ్లే అర్హులని పంకజ్ పేర్కొన్నారు. మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసుకున్నవాళ్లు ఈ ఒక ఏడాది కోర్సుకు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఇలాంటి విద్యార్థులకు రెండేళ్ల బీఈడీ కోర్సు ఎప్పట్లాగే కొనసాగుతోందని చెప్పారు.

# కోయిల్ కొండలో ఇసుక డంపులు సీజ్



**ఫలించిన నేనుసైతం పోరాటం**

**ఇసుక డంపులు సిజ్ చేసిన అధికారులు**

**ఇసుక మాఫియాపై నేనుసైతం నిరంతర పోరాటం**

**సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్**

దేవరకద్ర ప్రతినిధి,ఫిబ్రవరి11(తీన్మార్ న్యూస్) ఇసుక అక్రమ రవాణాపై నేనుసైతం చేస్తున్న పోరాటం ఫలించిందని సామాజిక కార్యకర్త,నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ తెలిపారు. నేనుసైతం వరస ఫిర్యాదుల నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణాపై ఎట్టకేలకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మంగళవారం ఆశ్చర్యపూర్,కొత్తూరు,సూరారం వద్ద ఇసుక మాఫియా అక్రమంగా ఏర్పాటు చేసిన డంపులను సీజ్ చేసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. గత కొంతకాలంగా మహబూబ్ నగర్ జిల్లా కోయిల్ కొండ మండలంలో ఇసుక మాఫియా యాదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తుందన్నారు. ఈ అక్రమ రవాణాపై తాము ఎప్పటికప్పుడు సాక్షాదారులతో సహా జిల్లా రెవిన్యూ,పోలీస్,మైనింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూనే వస్తున్నామని ఆయన తెలిపారు.ప్రధానంగా కోయిల్ కొండ మండలంలోని లింగల్చేడు, సూరారం,శేరివేంకటాపూర్,ఆచార్యపూర్,కొత్తూరు తదితర వాగుల నుంచి కొనసాగుతున్నరు.ఈ ఇసుక డంపుల విలువ దాదాపు 30 నుంచి 40 లక్షల్లో ఉంటుందని వారు పేర్కొన్నారు.

**ఇసుక మాఫియాపై కేసులు నమోదు చెయ్యాలి: ప్రవీణ్**

మహబూబ్ నగర్ జిల్లా కోయిల్ కొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇసుక మాఫియాపై వెంటనే కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,ఎస్పీలను సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ కోరారు.

# అర్చకుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం




## దాడిని ఖండిస్తూ నిరసన దీక్ష

సూర్యాపేట ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్) : చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు ఎంవి రంగరాజన్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు తెలంగాణ అర్చక సమాఖ్య మరియు దేవాలయాల ధార్మిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షకులైన అర్చకులపైన, సనాతన ధర్మం పైన జరుగుతున్న దాడిని యావత్ హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తున్నదని, సమాజమంతా బాగుండాలని కోరుకొని నిత్యము దైవ ఆరాధనలో ఉండే అర్చకుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వీర రాఘవరెడ్డిని కఠినంగా శిక్షించాలని కోరారు.మరోమారు ఏ అర్చకుడిపై కానీ ఆలయాలపై గాని దాడి జరగకుండా చూడాలని హెచ్చరిస్తూ తదనుగుణంగా ప్రభుత్వాలు అర్చకులకు ఆలయాలకు భద్రత కల్పించాలని హిందూ ఐక్యవేదిక నాయకులు కోరారు.ఈ నిరసన కార్యక్రమంలోఉమ్మడి నల్గొండ జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వలివేటి వీర భద్ర శర్మ వైష్ణవ సంఘం జిల్లా నాయకులు దరూరి రామానూజా చార్యులు, బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు చకిలం రాజేశ్వర్ రావు, హిందూ ఐక్య వేదిక కన్వీనర్లు పర్వతం శ్రీధర్, నాగవెల్లి ప్రభాకర్, గట్ల సోమయ్య, అర్చక స్వాములు, రెంటాల సతీష్, భట్టారం వంశీ కృష్ణ, శ్రీధరా చార్యులు, సంకర్షణాచార్యులు శ్రీహరి ఆచార్యులు, సాగర శర్మ, మరింగంటి శ్రీనివాసాచార్యులు వికాస తరంగిణి, ఆండాళ్ గోష్టి మహిళా భక్తులు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఎంతటి పోరాటాలైనా సిద్ధం

## మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు



**సిద్దిపేట, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్) :** రైతుల కోసం ఎంతటి పోరాటాలు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధరలేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

# రక్షణరంగంలో స్వావలంబన, ఎగుమతులు

## ఆత్మనిర్భర భారత్‌తో సవాళ్లను అధిగమిస్తున్న రక్షణశాఖ

**బెంగళూరు, ఫిబ్రవరి11 (తీన్మార్ న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణరంగ ఉత్పత్తుల్లో భారత్ దూసుకుపోతోంది. మన దేశంలో కొత్త పరికరాల తయారీయే కాకుండా ప్రపంచం కోసం తయారుచేయాలనే పిలుపును అందిపుచ్చుకున్న రక్షణరంగం– అత్యాధునిక సామర్థ్యాలతో భావి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. కర్ణాటకలో యలహంకలోని వైమానిక కేంద్రంలో జరుగుతోన్న 15వ ఏరో ఇండియా ప్రదర్శన వీటన్నింటికీ వేదికగా నిలిచింది. 2047 వైపు పురోగమిస్తోన్న భారత్.. వైమానిక రంగంలో స్వావలంబన, సాంకేతికంగా అధునాతన శక్తిగా ఆవిర్భవించేందుకు కట్టుబడి ఉంది. ఇంటిలిజెన్స్, నిఘా, లాజిస్టిక్స్‌లో మన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడంతో మిలిటరీ ఆపరేషన్‌లలో కీలకపాత్ర పోషించడానికి వీలు కలగనుంది. అలాగే తర్వాత తరం యుద్ధ హెలికాప్టర్లు, ఏఐ ఆధారిత డ్రోన్లను అభివృద్ధి చేయడం వల్ల మన సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ నారీశక్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పలు కీలక పోస్టుల్లోకి మహిళా అధికారులను తీసుకుంటోంది. దీంతో స్త్రీ, పురు షులు అనే తేడా లేకుండా మిలిటరీ ఆపరేషన్లలో నారీమణులు కీలకంగా వ్యవహరిం చేం దుకు దోహదం చేయనుంది. ఆ దిశగా 2022లో మిలిటరీ పైలట్లుగా చేరిన వారిలో మేజ ర్ అభిలాషా బారక్.. ప్రతిష్ఠాత్మక సిల్వర్ చీతా ట్రోఫీని దక్కించుకున్నారు. కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణలో భాగంగా అద్భుతమైన ప్రతిభ చూపినవారికి దీనిని అందిస్తారు. ప్రస్తుతం ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్‌లో 13 మంది మహిళలు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ ఆపరేషన్లలో 8 మంది, వివిధ ఆర్మీ ఏవియేషన్ స్క్వాడ్రన్‌లలో 9 మంది విధులు నిర్వర్తి స్తున్నారు. అలాగే యుద్ధరంగంలోనూ వారిని మోహరిస్తున్నారు. వారి సామర్థ్యాన్ని గుర్తించిన భారత సైన్యం.. మహిళా అధికారులకు సాధికారత కల్పించడానికి కట్టుబడి ఉంది.



# మాఘపౌర్ణమితో కుంభమేళాకు రద్దీ

## పౌర్ణమి రోజు నదీ, సముద్రస్నానాలకు శ్రేష్ఠం




ప్రయాగరాజ్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్) : మాఘ పూర్ణిమ.. కారణంగా కుంభమేళాకు మరింతగా భక్తులు పోటెత్తనున్నారు. ఇప్పటకే రోజుకు కోటిన్నర వరకు పుణ్యస్నానాలకు వస్తున్నారని అంచనా. ఈ నెల 12న మాఘపూర్ణిమ కారణంగా మరింత రద్దీ పెరగనుంది. ఇప్పటికే వందల కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హిందూ పురాణాల ప్రకారం ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల ఆర్థిక బాధలు తొలగి అష్టైశ్వర్యాల సిద్ధి కలుగుతుందని చెప్తారు. పౌర్ణమి నాడు బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేసి సూర్య భగవానుడికి అర్ఘ్యం అర్పించడంఅ వసరమని అంటున్నారు. దీంతో త్రివేణి సంగమానికి భక్తులు పోటెత్తనున్నారు. స్నానానంతరం పూజా కైంకర్యాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. వీలైతే ఏదైనా దేవాలయాన్ని సందర్శించడం వల్ల శుభం కలుగుతుంది. ఈ రోజున చేసే గంగా స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కానీ, ఇది అందరికీ సాధ్యపడకపోవచ్చు. కాబట్టి వీలైనవారు నదీ స్నానం చేసుకుని శివకేశవులను ఆరాధించుకోవచ్చు. మాఘ పౌర్ణమి రోజున మద్య మాంసాలకు దూరంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లో జీవహింస చేయరాదు. ఇనుప వస్తువులు, నల్లని బట్టలు, వెండి, పాలు, ఉప్పు, సూదులు, కత్తెరలు వంటి పదునైన వస్తువులు బయటకు ఇవ్వకూడదు. ఇలా చేయడం వల్ల శని, చంద్ర దోషాలు వస్తాయని చెప్తారు. వీలైతే వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లిని తీసుకోకుండా ఉండాలి. మీ భోజనం మీరే వండుకోవడానికి ప్రయత్నించండి. ఇక ఇతరులను మోసగించడం, దూషించడం, శారీరకంగా, మాటలతో గానీ హింసించడం వంటివి చేయకూడదు. ఇతరులను అకారణంగా నిందించకూడదు. నల్ల దుస్తులు ధరించకూడదు. రాత్రి ఎక్కువ సమయం వరకు మేలుకుని ఉండకూడదు. ఈ రోజు కచ్చితంగా బ్రహ్మ ముహూర్తంలో స్నానం ఆచరించడానికి ప్రయత్నించడం మంచిదని అంటున్నారు. ఇది ఎంతో శ్రేష్ఠమైనదిగా నమ్ముతారు. అవసరంలో ఉన్నవారికి, పేదవారికి అన్న, వస్త్ర దానాలు చేయడం చాలా మంచింది. విష్ణు మూర్తిని పూజించడం, పౌర్ణమి వెన్నెల్లో విష్ణు సహస్రనామం జపించడం ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజు చేసే ఉపవాసం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి. రోజున ఆహారం దానం చేసిన వారికి జీవితంలో ధనానికి, తిండికి లోటు ఉండదని నమ్ముతారు. లక్ష్మీదేవి వారింటిని ఐశ్వర్యంతో నింపుతుందని నమముతారు. పౌర్ణమి రోజున సౌందర్య సాధనాలను దానం చేయడం వల్ల భర్త పిల్లల ఆయుష్షు పెరుగుతుందని ఉత్తరాది ప్రజలు నమ్ముతారు. ఇలా చేయడం వల్ల లక్ష్మి దేవి ప్రసన్నం కలుగుతుందని నమ్ముతారు. మాఘపౌర్ణమి సందర్భంగా కూడా కుంభస్నానానికి వస్తారు. మౌని అమావాస్యతో పాటు ఈరోజుకు కూడా విశేష ప్రాధాన్యం ఉంది.



# 16 నుంచి 19 వరకు పెద్దగట్టు జాతర

### 65వ జాతీయ రహదారిలో వెళ్లే వాహనాల దారి మళ్లింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్) :** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం పెద్దగట్టు జాతర ఈనెల 16 నుంచి 19 వరకు జరగనుంది. యాదవుల కులదైవం పెద్దగట్టు లింగమంతులస్వామి ఇక్కడ పూజలందుకోనున్నాడు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఏర్పాట్ల కోసం ఇటీవల రూ.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటుగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది 10–15 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనా. జాతర నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ హైవేపై ప్రయాణించేవారికి ట్రాఫిక్ అలర్ట్ జారీ చేశారు. 65వ జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈనెల 16న తెల్లవారుజాము నుంచి దారి మళ్లింపు, ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. వాహనదారులు సహకరించాలని కోరారు.



# కుంభమేళాలో నో వెహికల్ జోన్

## మాఘపౌర్ణమితో ట్రాఫిక్ ఆంక్షలు

### రద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తుల రాకపై సిఎం సమీక్ష

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 11(తీన్మార్ న్యూస్) :** మాఘ పూర్ణిమతో పాటు కొన్ని రోజుల్లో కుంభమేళా పూర్తికానున్న నేపత్యంలో ప్రయాగ్‌రాజ్‌కు భారీగా భక్తులు తరలిరానున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఆ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. దానిని దృష్టిలో ఉంచుకొని మాఘ పూర్ణిమ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ఒకరోజు ముందు నుంచే మంగళవారమే ఆంక్షలు విధించారు. ఇప్పటికే గత వారాంతం ఎఫెక్ట్‌తో 350 కి.మీ. దూరం వరకు వాహనాలు నిలిచిన సంగతి తెలిసిందే. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని అధికారులు కొత్త ఆంక్షలను అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా మార్పు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ మొత్తాన్ని నో వెహికల్ జోన్‌గా మారుస్తామని వెల్లడించారు. శని, ఆదివారాల్లో లక్షల మంది కుంభమేళా యాత్రికులు ఏకంగా 24 గంటలకు పైగా రహదారి పైనే వాహనంలో ఉండిపోవాల్సి వచ్చింది. జబల్‌పుర్–ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయ–రహదారిపై సుమారు 350 కి.మీ. పొడవున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటన ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌గా చరిత్ర పుటలకు ఎక్కింది. మరో 48 గంటల పాటు ఎవరూ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకుసాగాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. 50 కి.మీ. మేర దూరం వెళ్లడానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక, ట్రాఫిక్ ఏర్పాట్ల గురించి సోమవారం రాత్రి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పోలీసులు, అధికారులు సమావేశమయ్యారు. 'రోడ్లపై వాహనాలు భారీగా చేరకుండా చూడాలి. రద్దీ లేకుండా చూసుకోవాలి. పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి' అని సీఎం ఆదేశాలు ఇచ్చారు.

# వేసవికి ముందే భానుడి భగభగలు

## పలు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి11(తీన్మార్ న్యూస్) :** వేసవి ప్రారంభానికి ముందే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచే భానుడు దంచి భగభగమంటున్నాడు. మధ్యాహ్నం సమయాల్లో అయితే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 35 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా, రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటుగా.. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే మూడు నుండి 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌కు, ఇతర జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో తీవ్రమైన వేడి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేయటం ఖాయమని అంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–4 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ –హైదరాబాద్) అంచనా వేసింది. సోమవారం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయని చెప్పింది. ఇంకా ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 38 డిగ్రీల నుండి 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. హైదరాబాద్ నగరంలో 36 డిగ్రీల సెల్సియస్ నుండి 38 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అంటున్నారు. ఫిబ్రవరి 19 లేదా 20 వరకు కనీసం 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్టోగ్రతలు ఉంటాయన్నారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. కాగా, ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.




# కుంభమేళాకు 140 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (తీన్మార్ న్యూస్) :** ప్రయాణికులకు సౌకర్యార్థం కుంభమేళా జరిగే ప్రదేశాలకు దక్షిణమధ్యరైల్వే పరిధిలో 140 ప్రత్యేకరైళ్లు నడిపామని అధికారులు ప్రకటించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆయా రైళ్లలో సుమారు 1.30లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్న గయా, దానాపూర్, పాట్నా, ఆజంఘడ్, ప్రయాగరాజ్, రక్సాల్, బనారస్, గోమతినగర్(లక్నో) ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్లివచ్చారని తెలిపారు. ఇవి కాకుండా ఇతర జోన్ల నుంచి మరో 39 ప్రత్యేక రైళ్లు దక్షిణ మధ్యరైల్వే జోన్ మీదుగా వెళ్లాయని పేర్కొన్నారు. కుంభమేళాకు ఏర్పాటు చేసిన ప్రత్యేకరైళ్లన్నీ 149శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని వెల్లడించారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవకుండా లక్నో, ప్రయాగరాజ్, న్యూఢిల్లీ డివిజన్ కార్యాలయాల నుంచి సీనియర్ రైల్వే ఉన్నతాధికారులు యాత్రికుల రద్దీని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, ఆయా ప్రాంతాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోందని, రైళ్లు ఎక్కడివక్కడ ఆగిపోయాయని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం సరికాదని సీపీఆర్ఓ తెలిపారు. కుంభమేళాకు ప్రయాణికులు సజావుగా వెళ్లి వస్తున్నారని పేర్కొన్నారు.


# ₹ 9 లక్షల కోట్లు ఆవిరి..

## సెన్సెక్స్1000 పాయింట్లు డౌన్..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నేపథ్యంలో వరుసగా ఐదో రోజూ సూచీలు భారీ నష్టాలు ఎదుర్కొన్నాయి. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులూ ఉండవన్న ప్రకటనలు వాణిజ్య యుద్ధ భయాలను తీవ్రతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో సైతం అమ్మకాలు వెల్లువెత్తాయి. ఓ దశలో సెన్సెక్స్ 1200 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23వేల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,384.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,311.80) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత నష్టాల్లోకి వెళ్లింది. ఉదయం ఓ మోస్తరు నష్టాల్లో ట్రేడయిన సెన్సెక్స్.. మధ్యాహ్నం తర్వాత భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,030.59 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1018.20 పాయింట్ల నష్టంతో 76,293.60 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 22,986.65 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 309.80 పాయింట్ల నష్టంతో 23,071.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 60 పైసలు మేర బలపడి 86.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. జొమాటో, టాటా స్టీల్, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.9 లక్షల కోట్లు ఆవిరై రూ.408 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2932 డాలర్ల వద్ద కొనసాగుతోంది.







## విదేశీ లంచాల చట్టం నిలిపివేత

### ట్రంప్ నిర్ణయం


**వాషింగ్టన్:** భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టు కాంట్రాక్టుల వ్యవహారంలో అదానీ గ్రూప్‌పై విచారణ కోసం ఉద్దేశించిన ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ చట్టం (ఎఫ్‌సీపీఏ) నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడి న్యాయ శాఖను ఆదేశించారు. ఈ మేరకు 50 ఏళ్ల నాటి చట్టం నిలుపుదల చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. దీంతో అదానీ గ్రూప్‌నకు తాత్కాలికంగా ఊరట లభించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు అదానీ గ్రూప్ లంచాలు ఇవ్వజూపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిధుల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు ఉండడంతో ఇదే చట్టం కింద జో బైడెన్ సర్కారు విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారం చేపట్టిన ట్రంప్.. ఎఫ్‌సీపీఏ అమలును నిలిపివేయాలని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బొండిని ట్రంప్ ఆదేశించారు. ఎఫ్‌సీపీఏ చట్టం మార్గదర్శకాలు, విధివిధానాలను 180 రోజుల్లోగా సమీక్షించాలని అటార్నీ జనరల్‌కు సూచించారు. ట్రంప్ ఆదేశాల నేపథ్యంలో ఈ ఆరు నెలల్లో కొత్తగా ఈ చట్టం కింద ఎలాంటి దర్యాప్తులూ చేపట్టకూడదు. అయితే, ఆరు నెలలో రివ్యూ పీరియడ్ తర్వాత డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ఏ నిర్ణయం తీసుకుంటుందనే దాన్ని బట్టి అదానీ అంశం ఆధారపడి ఉంటుంది. ట్రంప్ తాజా నిర్ణయం నేపథ్యంలో అదానీ గ్రూప్ స్టాక్స్ ఉదయం లాభపడ్డాయి. అయితే, స్టాక్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో నష్టాల్లో ముగిశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.37 శాతం, అదానీ పవర్ 0.47 శాతం చొప్పున లాభపడ్డాయి.

#### అమెరికా చట్టాలు అత్యంత కఠినం.. నేర నిరూపణైతే తీవ్ర శిక్షలు

అమెరికాలో ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ), సెక్యూరిటీస్ అండ్ వైర్ ఫ్రాడ్, లంచం అభియోగాలతో అదానీపై కేసు నమోదైంది. ఆయా చట్టాల ప్రకారం శిక్షలు కఠినంగానే ఉంటాయి. అమెరికా కంపెనీలు, వ్యక్తులు, విదేశాల్లో అవినీతి వ్యవహారాల్లో భాగం కాకుండా చూడడమే ఎఫ్‌సీపీఏ చట్టం లక్ష్యం. ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు.

### గూగుల్ మెసేజెస్ నుంచి


## నేరుగా వాట్సాప్ వీడియో కాల్!



ప్రముఖ మెసేజింగ్ యాప్ గూగుల్ మెసేజెస్ కొత్త ఫీచర్‌ను పరిచయం చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇతర మెసేజింగ్ యాప్‌లకు పోటీగా పలు సదు-పాయాలు తీసుకొచ్చిన సంస్థ.. తాజాగా తన అప్లికేషన్ వేదికగా నేరుగా వాట్సాప్ వీడియో కాల్ చేసే ఫీచర్ అందించాలని చూస్తోంది. కమ్యూనికేషన్ సులభతరం చేయడం కోసం కొత్త ఫీచర్‌ను త్వరలోనే అందరికీ అందుబాటులోకి తేనుంది. గూగుల్ తన మెసేజింగ్ యాప్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. అందులోభాగంగానే వాట్సాప్ తరహాలోనే పలు ఫీచర్లను జోడిస్తూ వచ్చింది. త్వరలో తన యాప్ ద్వారా చాట్ చేస్తున్న సమయంలోనే స్క్రీన్‌పై వీడియో కాల్ ఆప్షన్ కనిపించనుంది. పైన కుడివైపున ఈ ఐకాన్ ప్రత్యక్షం కానుంది. ఆ ఐకాన్‌ని క్లిక్ చేసి నేరుగా వాట్సాప్ వీడియో కాల్ చేయొచ్చు. గూగుల్ మెసేజెస్ యాప్ నుంచి వాట్సాప్‌కు స్విచ్ అయ్యే సమస్య ఉండదు. ఒకవేళ యూజర్ వాట్సాప్ వినియోగించకుంటే ఆ కాల్ నేరుగా గూగుల్ మీట్‌కు కనెక్ట్ అవుతుంది. ఈ కొత్త ఫీచర్ సాయంతో కేవలం ఒక్క వ్యక్తికి మాత్రమే వీడియో కాల్ చేయొచ్చు. గ్రూప్ కాల్స్‌కు సపోర్ట్ చేయదు. రానున్న రోజుల్లో గ్రూప్ కాల్స్‌ను ఈ ఫీచర్‌ను విస్తరించనుంది. అయితే ఈ కొత్త ఫీచర్ ఎప్పుడు యూజర్లకు పరిచయం చేయనుందనే విషయాన్ని గూగుల్ ఇంకా ప్రకటించలేదు. రానున్న వారాల్లోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. ఇటీవలే గూగుల్ మెసేజెస్ '%శిబతీ జూతీశీటఱశ్రీవ%' పేరిట కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. ప్రొఫైల్‌పై నియంత్రణ అధికారాన్ని యూజర్లకు అందించేందుకు దీన్ని పరిచయం చేసింది.

## శాంసంగ్‌ను వెనక్కి నెట్టిన వివో..

### మార్కెట్ వాటాలో అగ్రస్థానం



దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో శాంసంగ్ అగ్రస్థానాన్ని కోల్పోయింది. చైనాకు చెందిన వివో సంస్థ ఆ స్థానాన్ని ఆక్రమించింది. 16.6 శాతం మార్కెట్ వాటాతో మొదటి స్థానంలో నిలిచింది. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ ఈ మేరకు 2024 సంవత్సరానికి సంబంధించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. గడిచిన ఏడాదిలో దేశీయంగా శాంసంగ్ తన మార్కెట్ వాటాను దాదాపు 4 శాతం కోల్పోయిందని ఐడీసీ నివేదిక వెల్లడించింది. 2024లో శాంసంగ్ మార్కెట్ వాటా 17 శాతం నుంచి 13.2 శాతానికి తగ్గిందని నివేదిక తెలిపింది. ఈ ఏడాది కాలంలో మొబైల్ సరఫరాలు 19.4 శాతం తగ్గుముఖం పట్టాయని పేర్కొంది. అదే సమయంలో ఐఫోన్ తయారీదారైన యాపిల్ క్రమంగా మార్కెట్ వాటాను పెంచుకుంది. గతంలో 6.4 శాతంగా ఉన్న ఆ కంపెనీ మార్కెట్ వాటా 8.2 శాతానికి చేరింది. మోటోరొలా 2.7 శాతంగా ఉన్న తన మార్కెట్ వాటాను 6 శాతానికి పెంచుకో గలిగింది. ఒకప్పుడు ప్రీమియం సెగ్మెంట్‌లో దూసుకెళ్లిన వన్‌ప్లస్ మార్కెట్ వాటా 6.1 శాతం నుంచి 3.9 శాతానికి పడిపోయింది. ఇదే కాలానికి రియల్‌మీ వాటా 12.5 శాతం నుంచి 11 శాతానికి, షావోమీ 12.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గాయి. 2024లో భారత్ మొత్తంగా 151 మిలియన్ యూనిట్ల స్మార్ట్‌ఫోన్ల సరఫరా జరిగినట్లు ఐడీసీ తెలిపింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 4 శాతం పెరిగింది. గతేడాదిలో అమెరికా, చైనా, జపాన్ తర్వాత యాపిల్‌కు నాలుగో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ అవతరించింది. షిప్‌మెంట్లు రికార్డు స్థాయిలో 12 మిలియన్ యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే 35 శాతం వృద్ధి నమోదు చేసిందని నివేదిక తెలిపింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో యాపిల్ 10 శాతం వాటాతో టాప్- 5 సంస్థల్లో ఒకటిగా నిలవడం గమనార్హం. ఐఫోన్ 15, ఐఫోన్ 13 విక్రయాలు ఇందుకు దోహదం చేసినట్లు ఐడీసీ నివేదిక తెలిపింది.

## మన 'ఉక్కు'

### ఉక్కు కార్యదర్శి సందీప్

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల, దేశీయ పరిశ్రమపై అంతగా ప్రభావం ఉండదని ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ తెలిపారు. మనదేశం నుంచి అమెరికాకు తక్కువ పరిమాణంలోనే ఎగుమతి చేస్తుండటం ఇందుకు కారణమన్నారు. 'గతేడాది 145 మిలియన్ టన్నుల స్టీల్‌ను మనం ఉత్పత్తి చేశాం. అందులో 95,000 టన్నులే అమెరికాకు ఎగుమతి చేశాం. ఇంత మొత్తాన్ని అమెరికాకు ఎగుమతి చేయలేనంత మాత్రాన, మన కంపెనీలకు ఏమీ ఇబ్బంది ఉండదు' అని బెంగాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బీసీసీ అండ్ ఐ) నిర్వహించిన ఓ కార్యక్రమంలో సందీప్ వివరించారు. దేశీయంగా వినియోగం అధికంగా ఉన్నందున, రానున్న సంవత్సరాల్లో గిరాకీకి తగ్గట్లుగా సరఫరా చేయడం ఉక్కు పరిశ్రమలకే సాధ్యం కాదేమోననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2018లో ఉక్కు, అల్యూమినియంపై అమెరికా పన్నులు విధించినప్పుడు.. భారత్ ప్రతిచర్యగా 29 అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచి, అంతే సమానమైన ఆదాయాన్ని రాబట్టుకుంది. చాలా దేశాలు ఇతర దేశాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తున్నందున ఎగుమతులకు సమస్య ఏర్పడుతోందని పౌండ్రిక్ తెలిపారు. దేశీయ సంస్థలకు సవాళ్లు ఎదురుకావచ్చు: మూడీస్: అమెరికా అదనపు సుంకాలు విధిస్తే.. ఆ దేశానికి ఎగుమతుల విషయంలో దేశీయ ఉక్కు కంపెనీలకు సవాళ్లు పెరిగే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ అభిప్రాయపడింది. గత 12 నెలల్లో భారత్‌లోకి అధిక దిగుమతుల వల్ల.. ఇప్పటికే దేశీయ ఉక్కు సంస్థల ఆదాయాలపై ప్రభావం పడిందని మూడీస్ రేటింగ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ హ్యు టింగ్ సిమ్ తెలిపారు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వివరాల ప్రకారం... 2018లో వాణిజ్య యుద్ధం ప్రారంభమయ్యాకా అమెరికాలోకి ఉక్కు, అల్యూమినియం దిగుమతులు పెరిగాయి. 2018లో ముడి ఉక్కు దిగుమతులు 31.1 బిలియన్ డాలర్లు కాగా.. 2024లో 33 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2024లో అమెరికాకు అత్యధికంగా ఉక్కు ఎగుమతి చేసిన దేశాల్లో కెనడా (7.7 బిలియన్ డాలర్లు), బ్రెజిల్ (5 బిలియన్ డాలర్లు), మెక్సికో (3.3 బిలియన్ డాలర్లు) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. చైనా నుంచి 550 మిలియన్ డాలర్లు, భారత్ నుంచి 450 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 4,000 కోట్ల) విలువైన ఉక్కు ఎగుమతులు నమోదయ్యాయి. 'అమెరికా తాజా టారిఫ్‌ల వల్ల ప్రభావితం అయ్యే దేశాలు ప్రతిచర్యకు దిగొచ్చ'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికా ఉక్కు తయారీ సంస్థలకు ప్రయోజనం ఉంటుందని మూడీస్ తెలిపింది. అక్కడ తయారయ్యే ఉక్కుకు గిరాకీ పెరగడం, విక్రయ ధరలూ అధికమవుతుండటమే ఇందుకు కారణంగా పేర్కొంది.



#### ఆ నిర్ణయం తీవ్ర ఆందోళనకరం: ఐఎస్‌ఏ

ఉక్కు దిగుమతులపై అమెరికా అదనపు టారిఫ్‌లు విధించనుండటంపై దేశీయ ఉక్కు సంఘం (ఐఎస్ఏ) తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. అంతర్జాతీయ వాణిజ్యానికి మరింత అవరోధాన్ని సృష్టించేందుకు ఈ నిర్ణయం దారి తీస్తుందని, ఉక్కు పరిశ్రమకు సవాళ్లూ తీవ్రం అవుతాయని ఐఎస్ఏ ప్రెసిడెంట్ నవీన్ జిందాల్ తెలిపారు. 'ఈ అదనపు టారిఫ్‌ల నేపథ్యంలో అమెరికాకు ఉక్కు దిగుమతులు 85% తగ్గే అవకాశం ఉంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా గణనీయ స్థాయిలో ఉక్కు ఉత్పత్తుల నిల్వలు పేరుకుంటాయి. ఆ నిల్వలు, వాణిజ్య ఆంక్షలు లేని భారత్ లాంటి కొన్ని ప్రధాన విపణులకు తరలివస్తాయి. ఈ పరిణామం భారత ఉక్కు పరిశ్రమకు ముప్పుగా మారుతుంది. ఇక్కడ ధరలు తగ్గడమే కాకుండా, అనైతిక పోటీ పరిస్థితులు ఏర్పడొచ్చ'ని ఆయన వివరించారు. లోహ షేర్లు విలవిల: అమెరికా సుంకాల నేపథ్యంలో లోహ కంపెనీల షేర్లు విలవిలలాడాయి. నాల్కో 4.83%, సెయిల్ 4.67%, వేదాంతా 4.31%, ఎన్ఎండీసీ 3.95%, టాటా స్టీల్ 3.11%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 2.20%, హిందాల్కో 1.67%, జిందాల్ స్టెయిన్‌లెస్ 1.61% నష్టపోయాయి.

#### హైదరాబాద్‌లో టెక్ మహీంద్రా జీసీసీ

హైదరాబాద్‌లో 3,000 సీట్లతో గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ (జీసీసీ) నెలకొల్పేందుకు టెక్ మహీంద్రా సన్నాహాలు చేస్తోందని సమాచారం. అమెరికాలోని ఒహాయో కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే గుడ్ ఇయర్ టైర్ అండ్ రబ్బర్ అండ్ కో.ఇన్ కోసం ఈ జీసీసీని టెక్‌మహీంద్రా నెలకొల్పనుంది. తమ ఖాతాదారుల కోసం జీసీసీ ఏర్పాటు చేసే టెక్ మహీంద్రా, వీటికి ఉద్యోగులను కేటాయించడంతో పాటు కేంద్ర నిర్వహణ బాధ్యతలనూ చూస్తుంది. ఈ కేంద్రం పరిశోధన-అభివృద్ధితో పాటు ఐటీ కార్యకలాపాలూ నిర్వహించనుందని సమాచారం. ఇందుకోసం ఇరు కంపెనీల మధ్య తుదిదశ చర్చలు జరుగుతున్నాయని తెలిసింది.




## ఐఆర్‌సీటీసీ లాభం రూ.341 కోట్లు..

### ఒక్కో షేరుపై 3 డివిడెండ్

భారతీయ రైల్వేకు చెందిన ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన సంస్థ రూ.341 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.300 కోట్ల లాభంతో పోలిస్తే 14 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం సైతం 10 శాతం పెరిగి రూ.1,225 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయంలో ఈ ఆదాయం రూ.1,115 కోట్లు. డిసెంబర్ త్రైమాసికంలో పన్ను అనంతర లాభం 11 శాతం పెరిగి రూ.308 కోట్లకు చేరినట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. క్యాటరింగ్ వ్యాపారం ద్వారా ఐఆర్‌సీటీసీకి వచ్చే ఆదాయం రూ.555 కోట్లుగా ఉంది. రైల్ నీర్ ద్వారా ఆదాయం రూ.96 కోట్లు, ఇంటర్నెట్ టికెట్ బుకింగ్ ద్వారా వచ్చే ఆదాయం రూ.354 కోట్లు, టూరిజం విభాగంలో రూ.224 కోట్లు ఆదాయం నమోదైనట్లు సంస్థ తెలిపింది. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గానూ మధ్యంతర డివిడెంట్‌ను ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ.3 చొప్పున డివిడెండ్ చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ ముగిసే సమయానికి ఐఆర్‌సీటీసీ షేర్లు 3.05 శాతం క్షీణించి రూ.750.10 వద్ద స్థిరపడ్డాయి.

### సిప్ రాబడులపై భయాందోళన

## అవసరం లేదన్న రాధికా గుప్తా



అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల నడుమ స్టాక్ మార్కెట్లు గత కొన్ని రోజులుగా వరుసగా నష్టాల్లోకి జారుకుంటున్నాయి. దీంతో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సిప్‌ల రాబడులపై మదుపర్లలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈవిషయంపై సోషల్‌మీడియా వేదికగా చర్చలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా మదుపర్లకు కొన్ని విలువైన సూచనలు చేశారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. మిడ్, స్మాల్ క్యాప్ సిప్‌లకు కేటాయింపుల్లో సమతౌల్యం పాటించాలని 'ఎక్స్' వేదికగా ఆమె సూచించారు. మిడ్, స్మాల్ క్యాప్ సిప్‌లలో పెట్టుబడి పెట్టేవారు ముఖ్యంగా ఈ కింది విషయాలు గుర్తుంచుకోవాలని రాధికా గుప్తా అన్నారు. అందులో మొదటిది మిడ్, స్మాల్‌క్యాప్ సిప్‌లలో సమతుల్యత ముఖ్యమన్నారు. మొత్తం పెట్టుబడుల్లో 30శాతం ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌లలో పెట్టాలని సూచించారు. మార్కెట్లలో ఉంటే అస్థిరత గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గుప్తా తెలిపారు. దీనికోసం ఓ ఉదాహరణను తెలిపారు. 2006 నుంచి 2013 వరకు రాబడుల్ని ఓసారి పరిశీలిస్తే ఎక్కడా అంత ఆసక్తికరమైన రిటర్నులు ఉండవన్నారు. స్వల్పకాలంలో వచ్చే మార్కెట్ భయాలను పట్టించుకోవద్దని పేర్కొన్న రాధిక.. సిప్‌లలో లాభాలు రావాలంటే దీర్ఘకాలం మదుపు చేయాలని సూచించారు. ఈ విషయంతో ఎవరూ విభేదించలేరన్నారు. సిప్‌లలో మంచి రాబడులు రావాలంటే కనీసం 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఏళ్లు సహనంతో వేచి ఉండాలన్నారు. క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక అనేది సామాన్యులకు ఓ సాధారణ పొదుపు పెట్టుబడి సాధనం అని గుప్తా అన్నారు. క్రమశిక్షణతో కూడిన ఈ దీర్ఘకాలిక వ్యూహాలపై దృష్టిసారించాలన్నారు. స్వల్పకాలిక ఆందోళనలతో భయపడొద్దని తెలిపారు.

# భారీ రికార్డుకు చేరువలో రోహిత్..




## మరో 13 పరుగులు చేస్తే దిగ్గజాలను దాటేస్తాడు


టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ భారీ రికార్డుకు చేరువలో ఉన్నాడు. అతను మరో 13 పరుగులు చేస్తే వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. సచిన్, రికీ పాంటింగ్, సౌరభ్ గంగూలీ, జాక్వెస్ కలిస్ వంటి దిగ్గజాల కంటే వేగంగా 11 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా హిట్‌మ్యాన్ నిలుస్తాడు. ఈ అరుదైన జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ 222 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇప్పటివరకు రోహిత్ 259 ఇన్నింగ్స్‌ల్లో 10,987 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్‌తో బుధవారం జరిగే మూడో వన్డేలో రోహిత్ ఈ భారీ రికార్డును సాధించే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో రోహిత్ (119బీ 90 బంతుల్లో) శతకం బాది ఫామ్‌లోకి వచ్చిన సంగతి తెలిసిందే. హిట్‌మ్యాన్‌కిది వన్డేల్లో 32వ సెంచరీ కాగా.. అంతర్జాతీయ క్రికెట్‌లో 49వ శతకం. మరో సెంచరీ చేస్తే సచిన్ తెండూల్కర్ (100), విరాట్ కోహ్లీ (81) తర్వాత 50 సెంచరీలు చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డుల్లోకెక్కుతాడు.

### అంత తేలిక కాలేదు

రెండో వన్డేలో సూపర్ సెంచరీతో కెప్టెన్ రోహిత్ పేలవ ఫామ్ నుంచి బయటకి రావడం ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌కు శుభసూచకమే. అయితే తిరిగి పరుగుల బాట పట్టే ప్రక్రియ చాలా కష్టమైందని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఆదివారం ఇంగ్లాండ్‌పై 90 బంతుల్లోనే 119 పరుగులు చేసిన అతడు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. "చాలా కాలంగా క్రికెట్ ఆడుతున్నా. నేనేం చేయాలో నాకు తెలుసు. ఈ రోజు అదే చేశా" అని రెండో వన్డే అనంతరం రోహిత్ చెప్పాడు. రెండో వన్డేలో రోహిత్ చేసిన శతకం.. 2023 అక్టోబరు తర్వాత అతడు సాధించిన తొలి వన్డే సెంచరీ. ఈ కాలంలో అతడు 13 మ్యాచ్‌ల్లో అయిదు అర్ధశతకాలు సాధించాడు. "నా శైలిలో బ్యాటింగ్ చేశా. చాలా కాలంగా ఆడుతున్నా. ఒకటి రెండు ఇన్నింగ్స్‌లు నా బ్యాటింగ్ తీరును మార్చవు. ఈ రోజు నాకు అన్ని రోజుల లాంటిదే" అని రోహిత్ చెప్పాడు. పరుగులు చేయడానికి ఏం చేయాలో తెలిసినా, ఫామ్‌ను అందుకోవడం అంత తేలిక కాలేదని అన్నాడు. 'కెరీర్‌లో ఎన్నో పరుగులు చేశా. ఎలా పరుగులు రాబట్టాలో తెలుసు. కానీ అదంత తేలిక కాలేదు. చాలా కష్టంగా మారింది. కానీ నేను ఆటను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టా" అని రోహిత్ పేర్కొన్నాడు. "మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ బాగా ఆడాలనుకుంటా. కొన్నిసార్లు బాగా ఆడొచ్చు.. కొన్నిసార్లు ఆడకపోవచ్చు. ఏం చేయాలనే విషయంలో స్పష్టత ఉన్నప్పుడు.. మిగతా విషయాలేమీ పట్టించుకోవాల్సిన అవసరం లేదు" అని చెప్పాడు.

# ఛాంపియన్స్ ట్రోఫీ.. బుమ్రా ఔట్?

### ఆ ఇద్దరికీ చోటు!



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సమరం ఆరంభానికి మరికొన్ని రోజులే మిగిలిఉంది. ఎనిమిది జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీ మరో వారం రోజుల్లో మొదలవనుంది. ఇప్పటికే అన్ని దేశాలు జట్లను ప్రకటించాయి. జట్టులో మార్పులు, చేర్పులకు మంగళవారంతో గడువు ముగియనుంది. వెన్నునొప్పి కారణంగా ఆటకు దూరంగా ఉన్న భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో ఉంటాడా? లేదా అనే దానిపై బీసీసీఐ నేడు (మంగళవారం) నిర్ణయం తీసుకోనుంది.

### బుమ్రాను తప్పిస్తే..

ఆస్ట్రేలియా పర్యటన చివర్లో వెన్నునొప్పితో ఇబ్బందిపడిన బుమ్రా.. అప్పట్నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. అహ్మదాబాద్‌లో ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో బుమ్రా ఆడి ఫిట్‌నెస్‌ను చాటుకొనే ప్రయత్నం చేస్తాడని వార్తలు వచ్చాయి. కానీ, బుమ్రా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి పరిమితమవడంతో అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ బుమ్రాను తప్పిస్తే అతని స్థానంలో ఇటీవల ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన యువపేసర్ హర్షిత్ రాణా ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి వన్డేలో హర్షిత్ ఆకట్టుకున్నాడు. ఏడు ఓవర్లు బౌలింగ్ చేసి 53 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఒక ఓవర్ మెయిడిన్. కటక్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో హర్షిత్ 9 ఓవర్లు వేసి 62 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ఏదేమైనా బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైతే భారత్‌కు అది గట్టి దెబ్బే.

### వరుణ్‌కు ఛాన్స్ దక్కితే బయటికి వెళ్లేదెవరు?

ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో అరంగేట్రం చేసిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసే అవకాశాలున్నాయి. అతను ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అదరగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. వరుణ్ తన తొలి వన్డేలో 10 ఓవర్లు వేసి 54 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. చక్రవర్తిని జట్టులోకి తీసుకుంటే కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లలో ఒకరిని పక్కనపెట్టాలి. అయితే, కుల్‌దీప్ జట్టులో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే జట్టులో ఉన్న ఏకైక మణికట్టు స్పిన్నర్ అతనే. ఫిబ్రవరి 11 తర్వాత కూడా ఐసీసీ సాంకేతిక కమిటీ అనుమతితో జట్టులో మార్పులు చేసుకోవడానికి వీలుంది. దీంతో సెలక్టర్లు బుమ్రా, వాషింగ్టన్ సుందర్‌లను ట్రావెలింగ్ రిజర్వ్‌లుగా ఎంపిక చేసే అవకాశాలు లేకపోలేదు.

## ఛాంపియన్స్ ట్రోఫీ..
# ఆ రెండు జట్లే టైటిల్ ఫేవరెట్లు

**ముత్తయ్య మురళీధరన్**



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సమరం మరో వారం రోజుల్లో మొదలవనుంది. ఈ మెగా టోర్నీలో భారత్, పాకిస్థాన్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు పాల్గొననున్నాయి. భారత్ ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో మిగతా మ్యాచ్‌లన్నీ పాక్‌లో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. 29 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ ఐసీసీ ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తుండటం విశేషం. టోర్నీ ఆరంభానికి మరికొన్ని రోజులే మిగిలి ఉండటంతో ఏఏ జట్లు సెమీస్‌కు చేరతాయి, ఏ జట్టు విజేతగా నిలిచే అవకాశముందనే దానిపై మాజీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. భీకరమైన పేస్ దాడి కలిగిన పాక్ సెమీఫైనల్ చేరుకుంటుందని భారత మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఇప్పటికే అంచనా వేశారు. తాజాగా శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ భారత్, పాకిస్థాన్‌లను టైటిల్ ఫేవరెట్లుగా ఎంచుకున్నాడు. 'టోర్నీలో భారత్, పాకిస్థాన్ టైటిల్ ఫేవరెట్లు. కానీ, కచ్చితంగా ఈ జట్టే ఛాంపియన్‌గా నిలుస్తుందని నమ్మకంగా చెప్పలేం. టోర్నీలో స్పిన్ బౌలింగ్ అనేది కీలకం. పాక్ పిచ్‌లు స్పిన్నర్లకు సహకరిస్తాయి. యూఏఈ పిచ్‌లు కూడా స్పిన్ బౌలింగ్‌కు అనుకూలిస్తాయి. ఈ టోర్నీలో స్పిన్నర్లు ఎక్కువ ప్రభావం చూపిస్తారు. భారత జట్టులో నలుగురు స్పిన్నర్లున్నారు. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ స్పిన్ ఎటాక్ బలంగా ఉంది. టీమ్ఇండియా, పాకిస్థాన్ జట్లు స్పిన్‌తోపాటు పేస్ బౌలింగ్‌లో పటిష్టంగా ఉన్నాయి' అని మురళీధరన్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ పేలవఫామ్‌తో ఇబ్బందిపడుతుండగా.. రోహిత్ శర్మ ఇంగ్లాండ్‌పై సెంచరీ చేసి ఫామ్‌లోకి వచ్చాడు. ఈ అంశంపై మురళీధరన్ మాట్లాడాడు. 'ఇద్దరు అసాధారణ ఆటగాళ్లు. వరల్డ్ క్లాస్ బ్యాటర్లు. ఫామ్ అనేది తాత్కాలికం. క్లాస్ అనేది శాశ్వతమని నేనెప్పుడూ చెబుతుంటా. రోహిత్ సెంచరీ చేశాడు. విరాట్ కూడా ఫామ్‌లోకి వస్తాడు. ఈ ఇద్దరు రాణిస్తే టోర్నీలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీని సాధిస్తుంది' అని మురళీధరన్ వివరించాడు.

# సైబర్ నేరగాళ్లకు రివర్స్ పంచ్..

### అలా తప్పించుకున్నా: సంజయ్ మంజ్రేకర్



ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ ద్వారా తెలిసినవారిలా నటిస్తూ అవతలి వారి నుంచి అధిక మొత్తంలో సొమ్ము లాగుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని జాగ్రత్తలు చెబుతున్నా కొందరు మాత్రం కేటుగాళ్ల వలలో చిక్కుతున్నారు. భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వీరి బారి నుంచి చాలా తెలివిగా తప్పించుకున్నారట. తన అనుభవాన్ని ఆయన 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వివరించారు. "పరిచయమున్న ఒక వ్యక్తి రూ.25 వేలు అవసరమున్నాయంటూ వాట్సప్‌లో మెసేజ్ చేశారు. అయితే.. అతడి ఫోన్ హ్యాక్ అయిన విషయం నాకు ముందే తెలిసింది. ఇదంతా సైబర్ నేరగాళ్ల పనేనని అర్థమైంది. దీంతో పేమెంట్ ఎలా చేయాలి అని అడిగా. అప్పుడు అతడు గూగుల్‌పే చేయమంటూ ఒక నంబర్ పంపించాడు. డబ్బు పంపాక అందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్ కూడా తనకు పంపాలని కోరాడు. అయితే.. రూ. 25 వేలు కాకుండా రూ. 25 లక్షలు పంపమంటారా..?" అని మంజ్రేకర్ రివర్స్ పంచ్ ఇచ్చారు. అలా అనేసరికి అవతలి వ్యక్తి నుంచి మెసేజ్‌లు ఆగిపోయాయని తెలిపారు. మంజ్రేకర్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'చాలా తెలివిగా పంచ్ ఇచ్చారు సర్' అంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. 2024 సర్వే ప్రకారం.. గత మూడేళ్లలో దేశంలోని సగం మంది ఆర్థిక మోసాలకు బలయ్యారు. 47 శాతం మంది ప్రజలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువసార్లు సైబర్ మోసాల బారిన పడ్డారు. ఎక్కువగా యూపీఐ, క్రెడిట్ ద్వారా మోసాలు జరిగినట్లు తెలిసింది. ఈ మోసాలపై అత్యంత జాగ్రత్తగా ఉండాలంటూ సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



# ఎయిర్‌పోర్ట్‌లో మహిళకు హగ్ ఇచ్చిన కోహ్లీ

### ఆ లక్కీ లేడీ ఎవరంటూ కామెంట్స్

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇటీవల బ్యాటింగ్‌లో అతను చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయకపోయినా కింగ్‌కు ఆదరణ తగ్గడం లేదు. కోహ్లీని చూడటానికి అభిమానులు స్టేడియానికి పోటెత్తుతున్నారు. ఇటీవల కోహ్లీ రంజీ ట్రోఫీలో ఆడగా ఆ మ్యాచ్‌ను వీక్షించడానికి అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కటక్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేకు ముందు రోజు విరాట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్న సమయంలోనూ స్టేడియానికి ఫ్యాన్స్ పోటెత్తారు. ఇక కోహ్లీ బయట కనిపిస్తే అతడితో షేక్ హ్యాండ్ ఇవ్వటానికి అభిమానులు పోటీపడుతుంటారు. అయితే, తాజాగా కోహ్లీ స్వయంగా ఓ మహిళ దగ్గరకు వెళ్లి హగ్ ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇంగ్లాండ్‌తో మూడో వన్డే కోసం భారత జట్టు అహ్మదాబాద్ బయలుదేరడానికి భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సమయంలో ఇది ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విమానాశ్రయంలో చెకింగ్ ఏరియాకి ముందు కొంతమంది ఫ్యాన్స్ క్రికెటర్లను చూడటానికి నిలబడ్డారు. కోహ్లీ అటువైపు వస్తూ ఆ గుంపులో ఓ మహిళని చూశాడు. నవ్వుతూ ఆమె దగ్గరికి వెళ్లి హగ్ ఇచ్చి మాట్లాడాడు. అక్కడ ఉన్న మిగిలినవారు కోహ్లీతో షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో భద్రతా సిబ్బంది కలగజేసుకొని కోహ్లీని అక్కడినుంచి పంపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విరాట్ నుంచి హగ్ అందుకున్న ఆ లక్కీ లేడీ ఎవరు?, ఆమెను కోహ్లీ ఎందుకు హగ్ చేసుకున్నాడు? అని ఫ్యాన్స్ నెట్టింట కామెంట్లు చేస్తున్నారు. అయితే, సదరు మహిళ కోహ్లీకి దగ్గరి బంధువు అని తెలుస్తోంది. అందుకే దగ్గరికి వెళ్లి హగ్ ఇచ్చాడని సమాచారం.



# క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత్..

### తుది జట్టులో 4 మార్పులు!

ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1 కైవసం చేసుకున్న టీమ్ఇండియా.. మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంపై కన్నేసింది. మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదున్న భారత జట్టు.. మూడో వన్డేలోనూ విజయం సాధించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాలని భావిస్తోంది. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ కోసం టీమ్ఇండియా తుది జట్టులో పలు మార్పులు చేసి బెంచ్ బలాన్ని పరీక్షించాలనుకుంటోంది. సిరీస్‌లో ఇప్పటివరకు ఆడని వికెట్‌కీపర్ రిషభ్ పంత్, ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు కన్పిస్తున్నాయి. తొలి వన్డేలో ఆడిన మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అహ్మదాబాద్‌లో ఆడే అవకాశాలున్నాయి. వికెట్‌కీపర్ కేఎల్ రాహుల్ స్థానాన్ని పంత్, షమి ప్లేస్‌ని అర్ష్‌దీప్ భర్తీ చేసే ఛాన్స్ ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో రాణించిన అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాకు విశ్రాంతి ఇచ్చి వారి స్థానంలో కుల్‌దీప్, సుందర్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. నాగ్‌పుర్‌లో జరిగిన మ్యాచ్‌తో వన్డేల్లోకి అరంగేట్రం చేసిన యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ మూడో వన్డేలో బెంచ్‌కే పరిమితమయ్యే ఛాన్స్ ఉంది. స్టార్ బ్యాటర్, కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావడం భారత్‌కు కలిసొచ్చే అంశం. విరాట్ కోహ్లీ కూడా అహ్మదాబాద్ వన్డేతో ఫామ్ అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. నరేంద్రమోదీ స్టేడియంలో భారత్ చివరి వన్డే మ్యాచ్ నవంబర్ 19, 2023న ఆడింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలై మూడోసారి విశ్వవిజేతగా నిలిచే అవకాశాన్ని చేజార్చుకుంది.

**భారత్ తుది జట్టు (అంచనా)**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.



# గంభీర్.. ఇది సరైన పద్ధతేనా..?

### తప్పుబట్టిన మాజీ క్రికెటర్

ఇంగ్లండ్‌ను టీ20ల్లో మట్టికరిపించిన టీమ్ఇండియా.. వన్డేల్లోనూ మరో మ్యాచ్ మిగిలిఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. వరుస విజయాలతో ముందుకు దూసుకెళ్తున్నప్పటికీ.. జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌పై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా వికెట్ కీపర్, బ్యాటర్ కేఎల్ రాహుల్ స్థానంపైనే ఈ చర్చంతా. అతడిని బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందికి పంపడంపై పలువురు మాజీలు కోచ్ గౌతం గంభీర్‌ను ప్రశ్నిస్తున్నారు. మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మరో అడుగు ముందుకువేసి ఇది సరైన పద్ధతి కాదంటూ గంభీర్‌పై మండిపడ్డాడు. రిషభ్ పంత్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం.. కేఎల్ బ్యాటింగ్ ఆర్డర్‌పై క్రిష్ స్పందించాడు. "శ్రేయస్ అయ్యర్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇది టీమ్ఇండియాకు సానుకూలాంశం. అయితే.. కేఎల్ రాహుల్ విషయంలో జరుగుతున్నది దురదృష్టకరం. అతడి విషయంలో వ్యవహరిస్తున్న తీరు న్యాయంగా లేదు. అతడి రికార్డులు చూడండి. నంబర్ 5వ స్థానంలో గొప్పగా రాణించాడు. టీమ్ మేనేజ్‌మెంట్ ఏం ఆలోచిస్తుందో తెలియడం లేదు. అతడిని 6, 7 స్థానాల్లో పంపిస్తే 6, 7 పరుగులే చేస్తాడు" అని క్రిష్ తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. ఈ విషయంలో గంభీర్ తీరుపై విమర్శలు గుప్పించాడు. కేఎల్ రాహుల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను ప్రమోట్ చేయడంపైనా ప్రశ్నించాడు. "గంభీర్.. నువ్వు చేస్తోంది సరైంది కాదు. పరిస్థితులను బట్టి అక్షర్‌ను నంబర్ 5వ స్థానంలో పంపొచ్చు. కానీ అది స్థిరమైన వ్యూహం కాకూడదు. ఇలాంటి మార్పులు కొనసాగిస్తే.. కీలకమైన మ్యాచ్‌లో పరిస్థితి ఏంటి..? మీరు చెబుతున్న లెఫ్ట్-రైట్ కాంబినేషన్ ద్వారా దీన్ని సమర్థించుకోలేరు. ఇదే విధానాన్ని టాప్-4 విషయంలో ఎందుకు పాటించరు..? నంబర్ 5 విషయంలోనే ఇది ఎందుకు..?అక్షర్ పటేల్ విషయంలో నాకెలాంటి ఇబ్బంది లేదు. అతడు తన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాడు. రాహుల్‌ను కిందికి పంపితే అతడి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ప్రపంచ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాడి విషయంలో ఇది న్యాయమేనా?" అని గంభీర్‌పై ప్రశ్నల వర్షం కురిపించాడు. ఇక రిషభ్ పంత్‌ను పక్కన పెట్టడం కూడా సరైంది కాదని క్రిష్ అన్నాడు. మూడో వన్డేలో అతడిని తుది జట్టులోకి తీసుకోవాలని.. ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడించాలని సూచించాడు. ఇప్పటికే సిరీస్ గెలిచిన నేపథ్యంలో.. అహ్మదాబాద్‌లో జరిగే మూడో వన్డేలో టీమ్ఇండియా భారీ మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఆడే చివరి వన్డే కావడంతో.. ఇప్పటివరకూ ఛాన్స్ రానివారిని తుది జట్టులో ఆడించనున్నట్లు తెలుస్తోంది.



# ఆర్టీసీ బస్సులో 'తండేల్'

## విచారణకు ఆదేశించిన సంస్థ ఛైర్మన్

నాగచైతన్య, సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్'. ఈ సినిమా విడుదలైన నాటి నుంచి దీన్ని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం రిలీజ్ అయిన రెండు రోజుల్లోనే ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో దీన్ని ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. నిర్మాత బన్నీవాసు స్పందిస్తూ ఈ ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తాజాగా దీనిపై విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై ఎంక్వైరీ చేసి పూర్తి వివరాలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 'తండేల్' పైరసీ సినీ ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీని గురించి ఆ సినిమా నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీవాసు ప్రెస్‌మీట్ నిర్వహించారు. పైరసీని ప్రోత్సహిస్తోన్న వారిపై మండిపడ్డారు. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఆ పైరసీ ప్రింట్ ప్రదర్శించడం దారుణమని.. చిత్ర విజయాన్ని ఆస్వాదించే సమయంలో ఇదొక ప్రతిబంధకం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఇలా సినిమాల్ని పైరసీ చేస్తున్నారని.. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్స్‌లో ఆ లింక్స్‌ను ఫార్వర్డ్ చేస్తున్నారని అన్నారు. అలా పైరసీ చేస్తున్న వారిని, దాన్ని ప్రోత్సహిస్తున్న వారిని గుర్తించి కేసులు పెడుతున్నామని.. వాళ్లంతా జైలుకు వెళ్లే అవకాశముందని హెచ్చరించారు.



# పదేళ్ల తర్వాత మళ్లీ?

సినిమాల్లో తన నటనతో మెప్పిస్తూనే.. మరోవైపు గాయకురాలిగా ప్రేక్షకుల్ని అలరిస్తుంది అందాల తార శ్రుతి హాసన్. ఇప్పుడామె మరో కొత్త ప్రాజెక్టును తన జాబితాలో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. తమిళ అగ్రకథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జన నాయగన్'. హెచ్.వినోద్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో శ్రుతి హాసన్ ఓ కీలక పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చర్చలు పూర్తయినట్లు సమాచారం. ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో మమితా బైజు, వరలక్ష్మీ శరత్‌కుమార్, రెబా మోనికా జాన్ తదితరులు నటిస్తున్నారు. మరి 2015లో 'పులి' అనే సినిమా కోసం జంటగా మెరిసిన విజయ్, శ్రుతి.. మళ్లీ దశాబ్దం తర్వాత తెరపై ఎలాంటి హంగామా చేయనున్నారో తెలుసుకోవాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

# విజయ్ దేవరకొండ కోసం రణ్‌బీర్, ఎన్టీఆర్, సూర్య వాయిస్



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్). ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర బృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. దీని టైటిల్ టీజర్ ఫిబ్రవరి 12న రిలీజ్ కానున్నట్లు తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రానున్న విషయం తెలిసిందే. దీని హిందీ వెర్షన్‌కు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారు. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను పంచుకుంది. 'యానిమల్' హీరో వాయిస్‌తో ఈ చిత్రం మరింత వైల్డ్‌గా మారనుందని.. ప్రేక్షకులకు కావాల్సిన ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుందని పేర్కొంది. తమిళ టీజర్‌కు స్టార్ హీరో సూర్య వాయిస్ అందించనున్నట్లు మూవీ టీమ్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు, ఎన్టీఆర్ వాయిస్‌తో తెలుగు టీజర్ రానుంది. తాజాగా ఈ వివరాలు ప్రకటిస్తూ చిత్ర బృందం ఫొటో పంచుకుంది. "నిన్న చాలాసేపు ఎన్టీఆర్ అన్నతోనే ఉన్నా. వ్యక్తిగత జీవితం, సినిమా తదితర అంశాల గురించి మాట్లాడుకున్నాం" అని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు ఎన్టీఆర్‌కు థాంక్స్ చెప్పారు. ఇందులో విజయ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. మళ్లీ రౌడీ హీరో విజయ్ దేవరకొండను పవర్‌ఫుల్‌గా చూడనున్నారని నిర్మాత ఓ సందర్భంలో అన్నారు. మార్చి 28న ఈ సినిమా విడుదల కానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రానున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. 'విధి పిలిచింది.. రక్తపాతం ఎదురుచూస్తోంది.. కొత్త రాజు ఉద్భవిస్తాడు' అంటూ టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తి పెంచిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# డ్రగ్స్ కేసు.. నిర్దోషిగా తేలిన 'దసరా' విలన్

సినీ నటుడు షైన్ టామ్ చాకో సహా మరో ఆరుగురిని నిర్దోషిగా తేలుస్తూ మంగళవారం కేరళ కోర్టు తీర్పు వెలువరించింది. 2015లో ఓ ఫ్లాట్‌లో కొకైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు దానికి సంబంధించిన కేసులో చాకో సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన సినిమాల్లో నటిస్తున్నారు. మరోవైపు కోర్టులో కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. ఎర్నాకుళం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఈ రోజు విచారణ జరగ్గా, కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సులేఖ.. నటుడు చాకో సహా ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించారు. ఇందులో నలుగురు మహిళలు ఉండటం గమనార్హం. వీరితో పాటు ఓ నైజీరియన్, తమిళనాడుకు చెందిన పృథ్వీరాజ్ అనే వ్యక్తి కూడా ఉన్నారు. నాని కథానాయకుడిగా నటించిన 'దసరా'లో చిన్ననంబిగా తనదైన విలనిజాన్ని పండించిన చాకో ఆ తర్వాత తమిళ, మలయాళ చిత్రాల్లో ఎక్కువగా పాత్రలు దక్కించుకున్నారు. గతేడాది విడుదలైన 'దేవర'లోనూ కీలక పాత్ర పోషించారు. ఇక ఈ ఏడాది వచ్చిన 'డాకు మహారాజ్'లో ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్‌గా నటించారు. వీటితో పాటు, మోహన్‌లాల్ 'లూసిఫర్2', 'చత్తులి', 'బజూకా', 'ఆరామ్ తిరుకల్పన్' 'వెల్లప్పమ్', 'పారడైజ్ సర్కస్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు.

# సూర్యతో నటించడం గర్వంగా ఉంది : పూజా హెగ్డే



హీరో సూర్య నటించే 69వ చిత్రంలో తాను కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉందని ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న 'రెట్రో' మూవీ చిత్రీకరణ పూర్తి చేసి మే ఒకటో తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇందులో తనకు దక్కిన అవకాశంపై పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు నేను నటించిన చిత్రాలన్నీ నన్ను గర్వపడేలా చేశాయి. కానీ, 'రెట్రో' మాత్రం నేను గర్వించే చిత్రంగా ఉంటుంది. ఇందులోని ప్రతి సన్నివేశం నాకు చాలా ఇష్టం. షూటింగు సమయంలో పొందిన అనుభూతి ఎన్నటికీ మరిచిపోలేనిది. సినిమా ఇంకా చూడకుండానే గట్టి నమ్మకంతో చెబుతున్నాను. ప్రస్తుతం 'రెట్రో' మూవీ ఎడిటింగ్ జరుగతోంది. త్వరలోనే మేకర్స్ ఆడియో, ట్రైలర్ రిలీజ్ తేదీలు వెల్లడిస్తారు' అని వివరించారు. ప్రస్తుతం తమిళంలో విజయ్ తో 'జన నాయగన్', 'కాంచన 4' చిత్రాలతో బిజీ గా ఉన్నారు.



# అనుకున్న తేదీకే 'ఇడ్లీ కడై'

ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). ఈ సినిమా ఏప్రిల్ 10 నుంచి వాయిదా పడినట్లు ఇటీవల రూమర్స్ వచ్చాయి. తాజాగా వాటిని చిత్ర బృందం ఖండించింది. అనుకున్న సమయానికే ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ అవుతుందని స్పష్టం చేసింది. 'జాబిలమ్మ నీకు అంత కోపమా' ట్రైలర్ విడుదల వేడుకలో ఈ వాయిదా రూమర్లను మేకర్స్ ఖండించారు. ఇందులో ధనుష్ సరసన నిత్యామేనన్ నటించారు. ధనుష్‌పై రష్మిక ప్రశంసలు కురిపించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన కొత్త చిత్రం 'జాబిలమ్మ నీకు అంత కోపమా'. ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ ప్రధాన పాత్రలు పోషించారు. ధనుష్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఫిబ్రవరి 21న తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ తనకెంతో నచ్చిందంటూ రష్మిక పోస్ట్ పెట్టారు. "ధనుష్ సర్.. నటుడు, దర్శకుడు, రైటర్, సింగర్, డ్యాన్సర్, మ్యూజిక్ కంపోజర్.. ఇలా ఏ పనిలోనైనా మీరు బెస్ట్ ఇస్తారు. 'జాబిలమ్మ నీకు అంత కోపమా' ట్రైలర్ అందరినీ నవ్విస్తుంది. మీ గ్యాంగ్ నాకెంతో నచ్చింది" అంటూ ఈ చిత్ర బృందాన్ని అభినందించారు. ధనుష్ హీరోగా రూపొందుతున్న 'కుబేర'లో రష్మిక నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ ముగింపు దశలో ఉంది. భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్ మునుపెన్నడూ చేయని కొత్త పాత్రలో కనిపించనున్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున కీలక పాత్ర పోషించారు.



# ఆ హీరో కోసం భారీ సినిమాను రిజక్ట్ చేసిన అనన్యపాండే

బాలీవుడ్ బ్యూటీ " అనన్య పాండే " గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ప్రముఖ బాలీవుడ్ నటుడు చుంకి పాండే కుమార్తెగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ బ్యూటీ.. 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2' ఫిల్మ్‌తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఈమె.. తెలుగులో కూడా ఒక సినిమాలో నటించింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లైగర్ సినిమాతో పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ అంచనాలతో రిలీజ్ అయినప్పటికీ డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. దాంతో తెలుగులో మళ్లీ మరో సినిమాకు ఓకే చెప్పలేదు. రీసెంట్ గానే లైగర్ సినిమాను అనన్య అయిష్టంగానే ఒప్పుకుందని చుంకీ పాండే చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో అనన్య పాండేకి సంబంధించి ఓ వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు హీరోయిన్స్. ఇక పలువురు హీరోయిన్లు అయితే కొంతమంది స్టార్ హీరోలు, దర్శకుల సినిమాల కోసం ఈగర్ గా ఎదురుచూస్తుంటారు. కానీ కొన్ని సార్లు డేట్స్ అడ్జెస్ట్ అవ్వక ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకుంటారు. ఇప్పుడు అనన్య పాండే డైరెక్టర్ ఇంతియాజ్ అలీ తెరకెక్కిస్తున్న సినిమాలో ఆఫర్ వచ్చిందట. బాలీవుడ్ లో ఇంతియాజ్ అలీ ప్రేమకథలు తెరకెక్కించడంలో మంచి పేరుంది. ఇంతియాజ్ ఓ భారీ బడ్జెట్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఆ సినిమాలో హీరోయిన్ గా అనన్యను అనుకున్నారట. అయితే కార్తీక్ ఆర్యన్ సినిమా షూటింగ్ లో ఆమె బిజీగా ఉండటంతో డేట్స్ అడ్జెస్ట్ కాక ఇంతియాజ్ అలీ సినిమాను రిజెక్ట్ చేసిందట.



# హీరో కోసం కోట్ల ఆస్తిని రాసిచ్చింది..

హీరో అభిమాని ఏకంగా కొన్ని కోట్ల విలువైన తన ఆస్తిని స్టార్ హీరో పేరు మీద రాసిచ్చి చనిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. సదురు హీరో చలించిపోయాడు. ఇంతకు ఏం జరిగిందంటే.. ముంబైకు చెందిన నిషా పాటిల్ కు నటుడు సంజయ్ దత్ అంటే పిచ్చి అభిమానం. చిన్నప్పటి నుంచి ఆయన్ను ఆరాధిస్తూ పెరిగింది. నామ్ నుంచి ఖల్ నాయక్ దాకా, సంజు నుంచి కెజిఎఫ్ 2 దాకా ప్రతి చిత్రాన్ని కొన్ని వందల సార్లు చూసింది. లెక్కలేనంత డబ్బు టికెట్లకే పెట్టింది. అయితే ఇటీవల నిషా పాటిల్ కన్నుమూసింది. ఆమె వయసు 62 సంవత్సరాలు. కన్నుమూసే నాటికి సుమారు 72 కోట్ల రూపాయల ఆస్తి నిషా పేరిట ఉంది. కాగా, అదంతా సంజయ్ దత్‌కు రాసేసి వెళ్లిపోవడం కుటుంబ సభ్యులను షాక్ కు గురి చేసింది. తన చివరి రోజులను ముందే గుర్తించిన నిషా పాటిల్ ఆస్తి డాక్యుమెంట్లను 2018లోనే లీగల్ గా రాయించి, బ్యాంకు అకౌంట్లలో ఉన్న డబ్బుని సంజయ్ దత్ కి అందజేయాలని లెటర్లు రాసి పక్కాగా బదలాయింపు చేసింది. ఇదంతా ఇంటికి దస్తావేజులు వచ్చాక కానీ.. సంజు బాబాకు మేటర్ అర్థం కాలేదు. అసలు పరిచయమే లేని ఒక అపరిచితురాలు ఆస్తి రాసివ్వడం చూసి నివ్వెరపోయాడు. విషాదం ఏంటంటే నిషా పాటిల్ ఇప్పటిదాకా సంజయ్ దత్ ని ప్రత్యక్షంగా కలవ లేదు. కానీ.. తన హీరో మీద ప్రేమ తో కోట్ల రూపాయలు కానుకగా ఇచ్చింది. సంజయ్ దత్ వాటిని స్వీక రించలేదు. త్వరలోనే వాళ్ళ ఫ్యామిలీకే అవి తిరిగి చెందేలా తన లీగల్ టీమ్‌ని పురమాయించారు. ఇంత వీరాభిమానిని కలుసుకోలేకపో వడం కలవపరిచిందని, కనీసం కుటుంబ సభ్యులనైనా కలిసి కొంత ఊరట చెందుతానని సంజయ్ దత్ పేర్కొన్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463